



మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ (ఫైల్ ఫొటో)

రెడ్డి మాస్టారు ఇకలేరు

మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ కన్నుమూత

- ఉపాధ్యాయ వృత్తి నుంచి రాజకీయాల్లోకి...
- తెలుగుదేశం పార్టీతో అరంగేట్రం
- 1983 ఎన్నికల్లో డమ్మీగా నామినేషన్
- ప్రధాన అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో అనూహ్యంగా పోటీలో నిలిచిన వైనం
- తొలిసారే ఘన విజయం... వరుసగా ఐదుసార్లు గెలుపు
- ఉమ్మడి జిల్లాలో ఇంతవరకూ అదే రికార్డు
- ఎన్టీఆర్ కేబినెట్‌లో పశుసంవర్ధక శాఖ నిర్వహణ
- టీటీడీ బోర్డు సభ్యునిగా, హస్తకళల బోర్డు చైర్మన్‌గా పదవులు నిర్వహణ
- ఉపాధ్యాయునిగా ఉన్నప్పుడే సాగునీటి ప్రాజెక్టుల కోసం కృషి
- నిరాడంబర జీవితం... అజాత శత్రువుగా గుర్తింపు
- పలువురు నాయకులు, ప్రముఖుల నివాళులు
- నేడు పెదగోగాడలో అంత్యక్రియలు

చోడవరం/మాడుగుల/చీడికాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):

మాజీ మంత్రి, మాడుగుల నుంచి వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన రెడ్డి సత్యనారాయణ (99) మంగళవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. నియోజకవర్గ ప్రజలతోపాటు రాజకీయ నాయకులు 'రెడ్డి మాస్టారు'గా పిలుచుకునే ఆయన వృద్ధాప్య సమస్యలతో చీడికాడ మండలం పెదగోగాడలోని తన నివాసంలో ఉదయం 5.15 గంటలకు కన్నుమూశారు. రెడ్డి సత్యనారాయణ మాడుగుల నియోజకవర్గం నుంచి వరుసగా 1983, 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎన్టీఆర్ కేబినెట్‌లో పశు సంవర్ధక శాఖా మంత్రిగా పనిచేశారు. మూడుసార్లు తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యునిగా, రాష్ట్ర హస్త కళల బోర్డు చైర్మన్‌గా, టీడీఎల్‌పీ ఉపాధ్యక్షుడి పదవులు నిర్వహించారు.



చంద్రబాబునాయుడుతో రెడ్డి సత్యనారాయణ (ఫైల్ ఫొటో)



రెడ్డి సత్యనారాయణ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ

ఉపాధ్యాయ వృత్తి నుంచి రాజకీయాల్లోకి...


రెడ్డి రామస్వామినాయుడు, అచ్చాలమ్మ దంపతులకు 1925వ సంవత్సరంలో సత్యనారాయణ రెండో సంతానంగా జన్మించారు. వాస్తవంగా రామస్వామినాయుడు సొంతూరు ప్రస్తుత విజయనగరం జిల్లాలో ఉన్న కొత్తవలస మండలం కంటకాపల్లి గ్రామం. ఆయన చీడికాడ మండలం పెద గోగాడకు చెందిన అచ్చాలమ్మను వివాహం చేసుకుని ఇక్కడకు ఇల్లరికం వచ్చారు. కాగా ఎస్ఎస్ఎల్‌సీ (ప్రస్తుతం పదో తరగతి) వరకు చదివిన రెడ్డి సత్యనారాయణ ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకుని 1952లో ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చారు. పెదగోగాడకు చెందిన నారాయణమ్మతో వివాహం అయ్యింది. వీరికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రెడ్డి సత్యనారాయణ 1982 వరకు ఉపాధ్యాయునిగా పని చేశారు. అదే ఏడాది ఎన్టీ రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీలో చేరారు.

వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా రికార్డు

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తరువాత 1983 జనవరిలో జరిగిన ఎన్నికల్లో మాడుగుల టికెట్‌ను పార్టీ అధిష్ఠానం అల్లు భానుమతికి కేటాయించింది. రెడ్డి సత్యనారాయణ ఆమెకు డమ్మీగా నామినేషన్ వేశారు. నామినేషన్ల పరిశీలనలో భానుమతి నామినేషన్ తిరస్కరణకు గురైంది. దీంతో డమ్మీగా నామినేషన్ వేసిన రెడ్డి సత్యనారాయణ టీడీపీ అధికారిక అభ్యర్థి అయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి బొడ్డు సూర్యనారాయణపై 16,882 ఓట్ల మెజారిటీతో గెలుపొంది తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. 1985 మధ్యంతర ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కురచా రామునాయుడుపై 28,421 ఓట్లు, 1989 ఎన్నికల్లో కూడా కురచా రామునాయుడుపై 10,084 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. 1994 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కిలపర్తి సూరిఅప్పారావుపై 27,091 ఓట్లు, 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి దొండా కన్నబాబుపై 5,831 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కరణం ధర్మశ్రీ చేతిలో ఓడిపోయారు. తరువాత ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఏకైక వ్యక్తిగా రెడ్డి సత్యరాయణ రికార్డు సృష్టించారు.

ఎన్టీఆర్‌తో అనుబంధం

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావుతో రెడ్డి సత్యనారాయణకు ప్రత్యేక అనుబంధం ఉంది. పార్టీ కార్యక్రమాల్లోగానీ, ఇతరచోట్లగానీ ఎంతమంది ఉన్నాసరే సత్యనారాయణ కనిపిస్తే...రెడ్డి మాస్టారు...రండి బ్రదర్ అంటూ ఆప్యాయంగా పిలిచేవారు. తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యునిగా నియమించిన తరువాత, వేంకటేశ్వరస్వామికి బంగారు కిరీటం చేయించే బృహత్తర బాధ్యతను ఎన్టీఆర్ తనకు అప్పగించడం తాను చేసుకున్న పుణ్యమని ఆయన తరచూ అంటుంటారు.



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావుతో...

నిరాడంబర జీవితం

ఒక్కసారి పంచాయతీ సర్పంచ్‌గా గెలిస్తే చాలు కారుల్లో తప్ప ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడానికి ఇష్టపడని పరిస్థితుల్లో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది, ఒకసారి మంత్రిగా పనిచేసిన రెడ్డి సత్యనారాయణ...ఆర్టీసీ బస్సుల్లోనే ఎక్కువగా ప్రయాణించేవారు. ఆడంబరాలకు, ఆర్భాటాలకు దూరంగా ఉంటూ కడవరకూ నిరాడంబర జీవితాన్ని గడిపారు. నిగర్వి, నిరాడంబరత...ఈ రెండు లక్షణాలే ఆయనను అందరికీ అభిమాన పాత్రుడుని ... మిగతా 6వ పేజీలో

అభిజిత్‌లో లేఆఫ్ ఎత్తివేత

- నేటి నుంచి యథావిధిగా కార్యకలాపాలు
- కర్మాగారం ప్రతినిధులు, కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యే విజయకుమార్ చర్చలు



అభిజిత్ ఫెర్రో అల్లాయిస్ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):

దాదాపు మూడు వారాల నుంచి మూతపడిన అభిజిత్ ఫెర్రో అల్లాయిస్ కర్మాగారం బుధవారం నుంచి తెరుచుకోనున్నది. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మంగళవారం ఇక్కడ జనసేన పార్టీ కార్యాలయంలో అభిజిత్ కర్మాగారం ప్రతినిధులు, కాంట్రాక్టర్లతో సమావేశమై చర్చించారు. బుధవారం నుంచి కార్మికులకు యథావిధిగా పనులు కల్పిస్తామని వారు హామీ ఇచ్చారు.

అభిజిత్ ఫెర్రో అల్లాయిస్ కార్మాగారం యాజమాన్యం గత నెల 14వ తేదీన లేఆఫ్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే తమకు మాటమాత్రంగానైనా చెప్పకుండా లేఆఫ్ ప్రకటించడం అన్యాయమని కార్మికులు ఆరోపిస్తూ ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ఇటీవల ఈఎస్ఐ ఆస్పత్రి శంకుస్థాపనకు వచ్చిన కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌తోపాటు అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌ను కలిసి లేఆఫ్ విషయాన్ని వారి దృష్టికి తీసుకువెళ్లారు. అయినప్పటికీ అభిజిత్ యాజమాన్యం నుంచి స్పందన లేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే విజయకుమార్ మంగళవారం కర్మాగారం ప్రతినిధులు, కాంట్రాక్టర్లతో సమావేశమై చర్చించారు. లేఆఫ్ ఎత్తివేసి, యథావిధిగా పనులు కల్పించడానికి యాజమాన్య ప్రతినిధులు అంగీకరించారు. దీంతో బుధవారం నుంచి కార్మికులు విధులకు హాజరుకావచ్చని ఎమ్మెల్యే వెల్లడించారు.

7,777

ఇదీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదుకు వచ్చిన దరఖాస్తుల సంఖ్య

- శ్రీకాకుళం జిల్లా నుంచి అత్యధికంగా 2,074 రాక
- అల్లూరి జిల్లా నుంచి కేవలం 179...
- ఓటర్ల నమోదుకు నేడే తుది గడువు
- 23వ తేదీ తరువాత మరోమారు అవకాశం

విశాఖపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):

వచ్చే ఏడాది నిర్వహించనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఓటర్ల నమోదుకు బుధవారంతో గడువు ముగియనున్నది. ఇప్పటివరకూ 7,777 మంది ఉపాధ్యాయులు ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వాటిలో 5,702 మంది దరఖాస్తులు పరిశీలించి అప్‌లోడ్ చేయగా, మిగిలినవి వేర్వేరు దశల్లో ఉన్నాయి.

ఓటర్ల నమోదుకు సెప్టెంబరు 30వ తేదీ నుంచి ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చినా...తొలి నుంచి టీచర్లు అంతగా ఆసక్తి చూపలేదు. రెవెన్యూ యంత్రాంగం పదేపదే విద్యాశాఖ అధికారులతో సమావేశాలు నిర్వహించిన నేపథ్యంలో గడచిన వారం, పది రోజుల నుంచి దరఖాస్తుల రాక పెరిగింది. బుధవారం నాటికి ఆన్‌లైన్‌లో 3,060, ఆఫ్‌లైన్‌లో 2,642 దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్‌లో వచ్చిన మరో 575 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి కాకుండా మరో 1500 దరఖాస్తులు ఆరు జిల్లాల పరిధిలో తహసీల్దార్ల కార్యాలయాలకు చేరాయి. ఇప్పటివరకూ వచ్చిన దరఖాస్తులు పరిశీలిస్తే...శ్రీకాకుళం జిల్లా నుంచి అత్యధికంగా 2,074 వచ్చాయి. విశాఖపట్నం జిల్లా నుంచి 1,305, విజయనగరం జిల్లాలో 1,079, అనకాపల్లి నుంచి 631, పార్వతీపురం మన్యం నుంచి 434 దరఖాస్తులు రాగా...అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి కేవలం 179 మంది టీచర్లు ... మిగతా 6వ పేజీలో

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి



అనకాపల్లి ఎన్టీఆర్ మార్కెట్‌యార్డు ఆవరణలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



అచ్యుతాపురం మండలం మల్లవరంలో జాజవలు తీసుకువెళుతున్న గ్రామస్థులు (-వార్త 8వ పేజీలో)

జిల్లా అంతటా నాగులచవితి వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఐదు గంటలకే భక్తులు సమీప ప్రాంతాల్లో పుట్టల్లో పాలు పోయడానికి కుటుంబసమేతంగా బయలుదేరారు. కోడిగుడ్లు, చలిమిడి, పండ్లు, నువ్వులు, నానబెట్టిన గంటెలను నాగేంద్రుడికి ఫలహారంగా సమర్పించి పూజలు చేశారు. పలువురు రైతులు తమ పంట పొలాల్లోని పుట్ట వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చారు.

ఇసుకాసురులకు చెక్!

అడ్డగోలుగా తవ్వకాలు జరిపితే వాల్టా చట్టం ప్రయోగం

- గృహ నిర్మాణాలకు ఇసుక కోసం 44 పాయింట్ల గుర్తింపు
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- ఒకటి, రెండు రోజుల్లో అనుమతులు



అనకాపల్లి మండలం మూలపేట వద్ద శారదా నదిలో ఇసుక తవ్వి, సమీపంలో నిల్వ చేసిన కుప్పలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ఉచిత ఇసుక పాలసీని అడ్డంపెట్టుకుని అక్రమాలకు పాల్పడుతున్న ఇసుకాసురులకు కళ్లెం వేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఉచితం మాటున అనధికారికంగా ఇసుక తవ్వకాలు జరిపి, దర్జాగా అమ్ముకుంటున్న వారిపై అధికారులు నిఘా పెట్టారు. వ్యక్తిగత అవసరాల పేరుతో ఇసుక తవ్వకాలు జరిపి, వ్యాపారం చేసేవారి వివరాలను సేకరిస్తున్నారు.

ఉచిత ఇసుక పాలసీని అవకాశంగా తీసుకుని అనకాపల్లి, నర్సీపట్నం, మాకవరపాలెం, చోడవరం, మాడుగుల, దేవరాపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం, కోటవురట్ల, తదితర మండలాల్లోని నదులు, గెడ్డల్లో ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు జరిపి అమ్ముకొంటున్నారు. కొందరు నదుల్లో నుంచి టైరు బండ్లతో ఇసుకను తీసుకు వచ్చి, సమీపంలో వున్న ఖాళీ స్థలాల్లో కుప్పలుగా నిల్వ చేస్తున్నారు. రాత్రిపూట లారీల్లోకి లోడింగ్ చేసి ఇతర ప్రాంతాలకు రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై మీడియాలో కథనాలు రావడంతో ఇటీవల కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి, ఎస్పీ తుహిన్ సిన్హా.. జిల్లా ఇసుక కమిటీ, రెవెన్యూ, గనుల శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇసుక అక్రమ వ్యాపారులపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించారు. వాల్టా చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నదుల్లో కనీసం మూడు మీటర్ల ఎత్తున ఇసుక ఉన్నచోట ఒక మీటరు మేర ఇసుక సేకరణ జరిగేలా ఆంక్షలు విధించారు. నదుల్లో వంతెనలు, రక్షిత పథకాలకు 50 మీటర్ల పరిధిలో ఇసుక తవ్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటారు. నదుల్లో నుంచి ఎడ్ల బండ్లతో మాత్రమే ఇసుక రవాణా చేసేలా నిబంధనలు అమలు చేస్తున్నారు. ఉచిత ఇసుక పేరుతో వ్యాపారం చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశంలో అధికారులు హెచ్చరించడంతో ఇసుకాసురుల వెన్నులో వణుకు మొదలైంది. కాగా స్థానిక అవసరాలకు ఉచితంగా ఇసుకను అందించేందుకు అధికారులు జిల్లాలో 44 పాయింట్లను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఆయా పాయింట్ల వద్ద పరిమితి మేరకు ఇసుక సేకరణకు ఒకటి, రెండు రోజుల్లో అనుమతులు ఇవ్వనున్నారు.

ఇసుక కొరత లేకుండా చర్యలు

జిల్లాలో ఇసుక కొరత లేకుండా చర్యలు చేపడుతున్నామని జిల్లా గనుల శాఖాధికారి మజ్జి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక అవసరాలకు, పేదల సొంతింటి నిర్మాణాలకు అవసరమయ్యే ఇసుక సేకరణకు జిల్లాలో 44 పాయింట్లను గుర్తించి ప్రభుత్వనకి నివేదిక పంపామన్నారు. భారీ మొత్తంలో ఇసుక అవసరం అయ్యే ప్రైవేటు నిర్మాణాలకు ఇసుక సరఫరా కోసం నక్కపల్లి, నర్సీపట్నం, అగనంపూడి డిపోల్లో ఇసుక నిల్వ చేసి విక్రయించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వానికి నివేదిక పంపామని చెప్పారు.

మజ్జి శ్రీనివాస్, గనుల శాఖ జిల్లా అధికారి

అనంత జలపాతాల హొయలు

మండలంలో అత్యధికం

- పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న కటికి, సరియా, తాటిగుడ జలపాతాలు
- సహజసిద్ధ ప్రకృతి అందాలకు నెలవు

- 6లో


గురవప్ప కల్యాణ మండపం వద్ద జన సందోహం


భక్తులకు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన భూలోకమాంబ అమ్మవారు


తీర్థంలో ఆకట్టుకున్న నేల వేషాలు

పాంచరాత్ర తీర్థానికి పోటెత్తిన భక్త జనం

- భక్తులతో కిక్కిరిసిన పట్టణ వీధులు
- ఆలయ పరిసరాల్లో కోలాహలం
- ఆకట్టుకున్న విద్యుత్ లైటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు

ఎలమంచిలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఎలమంచిలి పాంచరాత్ర ఉత్సవాల తీర్థ మహోత్సవానికి భక్త జనం పోటెత్తారు. మంగళవారం సాయంత్రం నుంచి పట్టణ వీధులన్నీ జనంతో కిక్కిరిపోయాయి. తులసీనగర్‌లోని భూలోకమాంబ అమ్మవారు, పాతవీధిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామిలను వేలాది భక్తులు దర్శించుకున్నారు. అనంతరం తీర్థ మహోత్సవాన్ని వీక్షించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి మోస్తరుగా ఉన్న భక్తుల రాక రాత్రి 8 గంటల నుంచి రద్దీ పెరిగింది. భూలోకమాంబ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.


తీర్థమహోత్సవానికి హాజరైన జనంతో కిటకిటలాడిన ప్రధాన రోడ్డు

ఉత్సవ కమిటీ చైర్మన్, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, ఆలయ ధర్మకర్త, మునిసిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ ప్రతినిధుల పర్యవేక్షణలో ఈ తీర్థం ఘనంగా నిర్వహించారు. రెండు ఆలయ పరిసరాలను విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. భూలోకమాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. ప్రధాన రోడ్డుతోపాటు తులసీనగర్, పాతవీధి ప్రాంతాల్లోని వీధులు కిక్కిరిపోయాయి. ప్రధాన రోడ్డు జంక్షన్, దిమిలి రోడ్డు జంక్షన్‌లు వద్ద భారీ ఎత్తున ఏర్పాటు చేసిన భారీ సెట్టింగ్‌లు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఆలయాలు వద్ద ఇస్కాన్ టెంపుల్, సుబ్రహ్మణ్యేశ్వర స్వామిల సెట్టింగ్, దేవతామూర్తుల సెట్టింగ్‌లు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. గురవప్ప కల్యాణ మండపం ఆవరణలో జెయింట్ వీల్, ఇతర ఆటల వద్ద చిన్నారులతో పెద్దల రద్దీ పెరిగింది. సుమారు 8 కిపైగా స్టేజి ప్రోగ్రామ్‌లు వద్ద జనం హోరెత్తించారు. పట్టణంలోకి ద్విచక్ర వాహనాలతోపాటు ఇతర వాహనాలు రాకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. సుమారు 200 మందికి పైగా పోలీసులు విధులు నిర్వర్తించారు.

పల్లె సంస్కృతికి అద్దం పట్టిన హాస్య ప్రదర్శన


తిమ్మరాజుపేటలో హాస్య ప్రదర్శన

అచ్యుతాపురం రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పల్లె సంస్కృతిని అద్దం పట్టే హాస్య ప్రదర్శన మండలంలోని తిమ్మరాజుపేటలో మంగళవారం జరిగింది. గ్రామంలోని పెద్దలు, పేరొందిన వ్యక్తులను అనుకరిస్తూ వారి హావభావాలను ప్రదర్శించే హాస్య ప్రదర్శన ప్రతీ ఏటా నాగుల చవితి రోజున జరిపిస్తారు. అదే గ్రామానికి చెందిన కళాకారులు తమ గ్రామ పరిధిలో ఉన్న వ్యక్తులను అనుకరించడం ఆచారంగా మారింది. ఉదయం పుట్టలలో పాలు వేసిన తర్వాత సాయంత్రం గ్రామం మధ్యలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేస్తారు. తమ గ్రామంలోని వ్యక్తుల నడక, మాటలు, వారు చేసిన పనులను హాస్యరూపంలో ప్రదర్శించడంతో నవ్వులు విరబూస్తాయి. విచిత్ర వేషధారణలతో, పురుషులే స్త్రీ వేషంలో గ్రామ మహిళలను అనుకరిస్తూ కామెడీని చేస్తారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు శరగడం భాగ్యలక్ష్మి, శివబాపునాయుడు, భీశెట్టి పెంటారావు, మళ్ల నాగేశ్వరరావు, శరగడం నాగార్జున, నారాయణమూర్తి, దిమ్మల జగ్గారావు, యల్లపు గోవిందు, కర్రి నాయుడు, భద్రరాజులు, చిన ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

అడవి పందుల నుంచి రక్షణకు చేనుకు చీరల కంచె

- రైతుల ప్రయోగం విజయవంతం


నునపర్తిలో వరి చేనుకు చీరలతో కంచె వేసిన దృశ్యం

అచ్యుతాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు పడి మేయకుండా ఎర్రైతైనా కర్రలు, తాటాకులతో పొలం చుట్టూ కంచె వేస్తారు. కొద్దిగా ఆర్థిక స్థోమత గత రైతు ఇనుప కంచె వేసుకుంటారు. కాని నునపర్తి, గొల్లగూడెం, నడింపల్లి ప్రాంతాల్లో కొండలు అధికంగా ఉండడంతో అడవి పందుల బెడద ఎక్కువగా ఉంది. ఎటువంటి కంచె వేసినా అడవి పందులు లక్ష్య పెట్టడం లేదు. ఏ పంట వేసినా నాశనం చేసేస్తున్నాయి. కర్రలు, తాటికమ్మలు, చివరకు ఇనుప ఊసలతో ముళ్ల కంచె వేసినా అడవి పందులు లక్ష్య పెట్టకుండా పంటలను నాశనం చేసేస్తున్నాయి. కాని పలుచని చీరలు కంచెగా వేస్తే చాలు అడవి పందులు పంట దరిదాపులకు కూడా రావడం లేదు. పెద్ద గాలి వేస్తే చిరిగిపోయే చీరలు అడవి పందుల దాడికి తట్టుకోలేవు. కాని అడవి పందుల బలహీనత వల్ల చీరలు కడితే పొలం దరిదాపులకు రావని రైతులు చెబుతున్నారు. ఎందుకంటే దూరంగా ఉన్న చీరలను రాత్రి పూట అడవి పందులు చూసి పొలం వద్ద మనుషులున్నారని భయపడి పొలాల్లోకి రావని రైతులు అంటున్నారు. అందువల్లే పొలం చుట్టూ చీరలు కడుతున్నారు. చీరలను వారపు సంతల్లో పాతబట్టలు విక్రయించే వారి నుంచి కొనుగోలు చేస్తామని రైతులు అంటున్నారు. దీంతో ఈ ప్రాంతంలో రైతులు తమ పంట పొలాల చుట్టూ చీరలతో కంచె వేస్తున్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు

పాయకరావుపేట, నవంబరు 5 : పట్టణంలో టీడీపీ సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పట్టణంలో టీడీపీ సభ్యత్వ నమోదుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులోనూ నాయకులు పర్యటించి రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. గతంలో కంటే అధికంగా పార్టీ సభ్యత్వాలు నమోదయ్యేలా పార్టీ శ్రేణులు కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు యాళ్ల వరహాలబాబు, మజ్జూరి నారాయణరావు, పల్లా విలియంకేరి, జూరెడ్డి ప్రసాద్, వేములపూడి అప్పారావు, భాస్కర చౌదరి, ఎం.దుర్గాప్రసాద్, సీహెచ్.పేర్రాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి


ఎలమంచిలిలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు


పాయకరావుపేట రూరల్: సత్యవరంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితిని మండలంలో ప్రజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే స్నానాలు చేసి పుట్టల్లో పాలు పోసి, బాణసంచాను కాల్చారు. పల్లెటూర్లలో కుటుంబాలతో సహా పుట్ట దగ్గరకి వెళ్లి పూజలు చేస్తారు. మత్స్యకార్ల గ్రామమైన పూడిమడకలో నాగుల చవితిని వారి సంప్రదాయంలో చేస్తారు. చిమ్మిడి, చలిమిడితో పాటు వీరు జూజాలు సమర్పిస్తారు. మత్స్యకారులు వారం రోజుల నుంచి పెసలు నానబెట్టి మొక్కలు వచ్చిన తర్వాత వాటిని చవితి నాడు పుట్ట వద్ద వేసి, కోడి కోసి ప్రత్యేక పూజలు చేస్తారు. బాణసంచాను కూడా కాల్చారు.

రాంబిల్లిలో..

మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కుటుంబాలతో కలిసి సమీపంలో గల పుట్టల వద్ద వెళ్లి పూజలు చేశారు. అక్కడే టపాసులను పేల్చారు.

ఎలమంచిలిలో..

నాగుల చవితి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కుటుంబ సమేతంగా పిల్లలు, పెద్దలు, వృద్ధులతో కలిసి పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేశారు. ఎలమంచిలి నాగేంద్రకాలనీలో నాగేంద్రుని ఆలయంలో తెల్లవారు


పాయకరావుపేటలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు

నుంచి భక్తులు నాగేంద్రునికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. మునిసిపాలిటీలోని పెదపల్లి, సోమలింగపాలెం, కొక్కిరాపల్లి, తెరువుపల్లి తదితర వార్డుల్లోను, మండలంలోని ఏటికొప్పాక, పీఎస్ఆర్‌పేట, పులపర్తి తదితర గ్రామాల్లో నాగుల చవితిని జరుపుకున్నారు.

నక్కపల్లిలో..

మండలంలోని పలు గ్రామాల్లో నాగుల చవితి వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. జానకయ్యపేట గ్రామానికి చెందిన కురందాసు గుర్రయ్య వంశీకులు 100 మంది నాగుల చవితిని తమ పొలంలో పుట్ట వద్ద జరుపుకున్నారు. ఈ మండలంలోని గుల్లిపాడు, రేబాక, ఉద్దండపురం, సీహెచ్‌ఎల్‌పురం, ఎన్.నర్సాపురం, ఉపమాక, చందనాడ, అమలలాపురం, వేంపాడు, న్యాయంపూడి, కాగిత, గొడిచెర్ల, జీ జగన్నాథపురం తదితర గ్రామాల్లో నాగుల చవితి సందడిగా జరిగింది. పంట పొలాల్లో వున్న పుట్టలను భక్తులు శుభ్రం చేసి, పసుపు, కుంకుమలు, పుష్పాలతో అలంకరించి నువ్వులతో చేసిన చిమ్మిడి నైవేద్యంగా సమర్పించి, నాగేంద్రుడికి హారతులిచ్చారు.

పాయకరావుపేట రూరల్‌లో..

మండలంలో నాగుల చవితిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే పుట్ట వద్దకు కుటుంబ సభ్యులందరూ వెళ్లి పుట్టలో పాలు, గుడ్లు వేసి పూజలు చేశారు. గుంటపల్లిలో జనసేన నాయకులు గెడ్డం బుజ్జి, పెంటకోటలో వైసీపీ నాయకులు చిక్కాల రామారావు కుటుంబ సభ్యులతో కలిసి పుట్ట వద్ద పూజలు నిర్వహించారు.

పాయకరావుపేటలో..

పాయకరావుపేట పట్టణ ప్రజలు భక్తిశ్రద్ధలతో నాగులచవితిని జరుపుకున్నారు. ఉదయాన్నే పుట్టల వద్దకు వెళ్లి చవితి పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు వ్యవసాయ భూముల్లో పుట్టల వద్ద నాగులచవితిని జరుపుకున్నారు.

ఎస్.రాయవరంలో..

మండల ప్రజలు నాగులచవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి కుటుంబ సమేతంగా పొలాల్లోకి తరలివెళ్లి పుట్టల వద్ద పూజలు చేశారు. గ్రామాల్లో ఎక్కడ చూసిన ఆధ్యాత్మిక శోభ సంతరించుకొంది.

ఒకే ఇంటి పేరు ఉన్న వారు ఒకేచోట పూజలు

కోటవురట్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆ ఊరులో ఒక ఇంటి పేరు ఉన్న వారంతా ఒకేచోట నాగుల చవితిని జరుపుకున్నారు. మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన చింతల ఇంటి పేరు ఉన్న 120 కుటుంబాల వారు నాగులచవితినాడు ఒకేసారి బయలుదేరి పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేస్తారు. ఊరు నుంచి కిలోమీటరు దూరం నడిచి వారు సాగుచేస్తున్న పంట పొలాలకు వెళ్లి వేర్వేరుగా విడిపోయి పుట్టల్లో పాలు పోస్తారు.


పుట్ట వద్ద పూజ చేసేందుకు వెళుతున్న ఒకే ఇంటి పేరు ఉన్న వారు

మండలంలో ఓపెన్ బారులు

- మద్యం దుకాణాల వద్దే బహిరంగంగా తాగేస్తున్నారు..
- మందుబాబుల హల్‌చల్
- ఇబ్బంది పడుతున్న మహిళలు
- పట్టించుకోని పోలీసులు, ఎక్సైజ్ అధికారులు


అడ్డరోడ్డు తిమ్మాపురంలో మద్యం దుకాణం పక్కనే తాగుతున్న మందు బాబులు

ఎస్.రాయవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో ఉన్న మద్యం దుకాణాలు ఓపెన్ బారులుగా మారాయి. నిబంధనల ప్రకారం మద్యం షాపుల వద్ద ఎవరైనా మద్యం బాటిళ్లను కొనుగోలు చేసుకొని వెళ్లిపోవాలి. కానీ మండలంలో ఏ మద్యం దుకాణం వద్దకు వెళ్లినా పక్కనే గ్లాసుల్లో మద్యాన్ని పోసుకొని దర్జాగా తాగేస్తున్నారు. ఎస్.రాయవరం, ధర్మవరం అగ్రహారం, అడ్డరోడ్డు తిమ్మాపురం గ్రామాల్లో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు పక్కనే మద్యం షాపులు ఉన్నాయి. దుకాణాల వద్ద కొనుగోలు చేసిన మద్యాన్ని మందుబాబులు పక్కనే సేవిస్తుండడంతో ఆ ప్రదేశాలు ఓపెన్ బారులను తలపిస్తున్నాయి. కొంతమంది మద్యం బాబులు తాగిన మత్తులో ఆ ప్రదేశాల్లో ఊగుతూ కనబడుతుండడంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలు చేస్తున్న మహిళలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అలాగే ఈ మార్గాల్లో పలు పాఠశాలల బస్సులు, విద్యార్థులు కూడా రాకపోకలు చేస్తుండడంతో అక్కడి దృశ్యాలన్నీ వారి కంట పడుతున్నాయి. అంతేకాకుండా ప్రధాన రహదారుల పక్కనే బహిరంగంగా మద్యం సేవిస్తుండడంతో మద్యం బాబులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఏ మద్యం దుకాణం వద్ద కూడా నిబంధనలు అమలు కావడం లేదు. బహిరంగ ప్రదేశాల్లో రాత్రి వేళల్లో మద్యం సేవిస్తూ దొరికితే అటువంటి వారిపై పోలీసులు కేసులు పెడుతుంటారు. అలాంటిది మండలంలోని పలు మద్యం షాపుల వద్ద నిబంధనలకు విరుద్ధంగా పట్ట పగలే మద్యం సేవిస్తున్నా ఎక్సైజ్, పోలీసులు పట్టించుకోవడం లేదు. పోలీసుల తీరుపై పలువురు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మద్యం షాపుల వద్ద నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న వ్యవహారాలపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


వైన్ షాపు పక్కనే మద్యం సేవిస్తున్న దృశ్యం


ధర్మవరం అగ్రహారంలో ఆరు బయటే..

జాతీయ తైక్వాండో పోటీలకు నలుగురు ఎంపిక


తైక్వాండో పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఎలమంచిలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు నలుగురు ఎలమంచిలి క్రీడాకారులు ఎంపికైనట్టు తైక్వాండో కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. ఎలమంచిలికి చెందిన యు.జయశ్రీ, టి. శ్వేత, పి.సుస్మిత, ఎన్.మోహిత్ ఇటీవల జరిగిన పలు టోర్నీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు సాధించడంతో జాతీయ పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. జయశ్రీ జేఎన్‌టీయూ తరఫున, శ్వేత ఆంధ్ర యూనివర్సిటీ తరఫున ఈనెల 12 నుంచి 15 వరకూ పంజాబ్ గురునానక్ దేవ్ యూనివర్సిటీలో జరిగే టోర్నీలో పాల్గొంటారన్నారు. అదేవిధంగా పోలవరపు సుస్మిత, నగిరెడ్డి మోహిత్ అండర్-17 స్కూలు గేమ్స్ ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ఈనెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ మధ్యప్రదేశ్‌లోని విధిషలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. నలుగురు క్రీడాకారులు, కోచ్ నగిరెడ్డి సత్యనారాయణలను పలువురు అభినందించారు.

నునపర్తిలో చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు

అచ్యుతాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నునపర్తి పంచాయతీలో టీడీపీ సభ్యత్వ నమోదు చురుగ్గా సాగుతోంది. రోజుకొక వీధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నునపర్తి అయిన తర్వాత పంచాయతీలోని శివారు గ్రామాల్లో కూడా సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తామని టీడీపీ నాయకుడు ఆర్‌వీవీ నగేష్ తెలిపారు. ఈకార్యక్రమంలో గొంప నరసింహనాయుడు, రెడ్డి శ్రీను, కన్నూరు ఎర్నాయుడు, వియ్యపు నాగేశ్వరరావు, గెడ్డం అశోక్, మానవరపు తమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వాడకంతో నష్టాలపై అవగాహన


సర్వసిద్ధి పీహెచ్‌సీ వద్ద అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తులు వాడకంతో కలిగే నష్టాలపై ప్రజలను చైతన్య వంతుల్ని చేయాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ఎస్‌వీ శక్తిప్రియ అన్నారు. మంగళవారం మండలంలోని సర్వసిద్ధి, పెనుగొల్లు పీహెచ్‌సీల వద్ద లంగ్, స్టమక్, పాంక్రియాస్ క్యాన్సర్లపై అగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వరి, వైద్య సిబ్బంది పీహెచ్‌ఎన్ రత్నసఖి, వై. సూర్యకుమారి, ప్రసాద్ పాల్గొన్నారు.

మనవాళ్ల మహామునులకు ప్రత్యేక పూజలు

నక్కపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో మంగళవారం మనవాళ్ల మహామునుల తిరు నక్షత్ర మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకుల బృందం ముందుగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, నిత్య హోమాలు నిర్వహించారు. అనంతరం మనవాళ్ల మహాముని మూలమూర్తికి, ఉత్సవమూర్తికి అభిషేకాలు,తిరునక్షత్ర పూజలు చేశారు. అనంతరం నూతన వస్త్ర అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు,పీసపాటి శేషాచార్యులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలకు ప్రొఫైలింగ్ యాప్‌పై వర్క్‌షాపు

ఎలమంచిలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే పథకాలు సక్రమంగా అందరికీ చేరువ కావాలంటే ప్రొఫైలింగ్ యాప్ ఎంతో కీలకమని మెప్మా పీడీ సరోజిని సూచించారు. స్థానిక మెప్మా కార్యాలయంలో ప్రొఫైలింగ్ యాప్ గురించి ఎలమంచిలి, నర్సీపట్నం మునిసిపాలిటీల్లోని ఆర్‌పీ, సీఆర్‌పీ, సీఓలకు ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె యాప్ వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో కమిషనరు ప్రసాదరాజు, డీఎంసీ వరలక్ష్మి, సీఎంఎం పద్మావతి, సీఓలు రమాదేవి, ఉమ, డీఆర్‌పీ శ్రీనివాసరావు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

పంచదార్ల, దిమిలిల్లో పొలం పిలుస్తోంది


పంచదార్లలో పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్న ఏవో సుమంత

రాంబిల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పంచదార్ల, దిమిలి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారిణి సుమంత నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి ఆమె వరి పొలాలను పరిశీలించారు. రబీలో రైతులకు పలు సూచనలు చేశారు. ఈనెల 15లోగా పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏహెచ్‌ఏ రేవతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హైమావతి, సరోజిని, మేఘన, దిమిలి సర్పంచ్ బంగారు చిలుకు, శిగిరెడ్డి ప్రసాద్, సూరిబాబు, నానాజి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వద్ద ఆశ కార్యకర్తల ఆందోళన


రాంబిల్లి పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న ఆశ కార్యకర్తలు

రాంబిల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దేముడు నాయుడు మాట్లాడుతూ ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తానని గత వైసీపీ ప్రభుత్వం చేసిన హామీ ఒప్పందాలు, జీఓ కాపీలను విడుదల చేయాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. ఈనెల 18న అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ఆశ ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధం చేసిన శిలాఫలకం ధ్వంసం

రోలుగుంట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంకేపట్నం నుంచి గిరిజన గ్రామమైన కొరుప్రోలుకు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.5 కోట్ల నిధులను మంజూరు చేసింది. దీనిలో భాగంగా స్థానిక ఎంకేపట్నం గ్రామ టీడీపీ నాయకులు మద్దు పైడితల్లినాయుడు తదితరులు ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజుతో ప్రారంభించడానికి సన్నాహాలు చేశారు. దీని కోసం శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. అయితే సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. సోమవారం రాత్రి గ్రామానికి చెందిన కొంత మంది యువకులు ఆ శిలాఫలకం వద్ద మందు పార్టీ చేసుకున్నారని టీడీపీ నాయకుడు మద్దు పైడితల్లినాయుడు తెలిపారు.

నర్సీపట్నంలో పోలీసు యాక్టు-30 అమలు: డీఎస్పీ మోహన్

నర్సీపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసు యాక్టు-30 అమలు చేస్తున్నామని డీఎస్పీ మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గుంపులు గుంపులుగా తిరగకూడదని, సమూహాలుగా ఉండకూడదని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అలాగే నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు.

మధుమేహం నియంత్రణపై అవగాహన

చీడికాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సాధారణ వ్యాధులపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఖండివరం హోమియో వైద్యశాల వైద్యాధికారిణి స్వర్ణలత సూచించారు. మంగళవారం చీడికాడ పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలకు ఆరోగ్యసంరక్షణ, సాధారణ వ్యాధులతో పాటు మధుమేహం నియంత్రణపై శిక్షణ ఇచ్చారు. పీహెచ్‌సీ వైద్యులు సునీల్‌కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

7న 220/132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన

- ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీడీవీ రామకృష్ణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ రామకృష్ణ

నర్సీపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బలిఘట్టంలో 220/132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరైందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీడీవీ రామకృష్ణ తెలిపారు. మంగళవారం పెదబొడ్డేపల్లిలోని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సీపట్నం మండలంలో నిరంతర విద్యుత్ సరఫరా కోసం రూ.67.35 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ నెల 7వ తేదీన ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్‌గా పనులు ప్రారంభిస్తారని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో డీఈ త్రినాథరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలి


విద్యార్థినికి ఫైబర్ బ్యాట్, నగదు అందిస్తున్న ఎస్ఐ తారకేశ్వరరావు

కృష్ణాదేవిపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటాలని కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు విద్యార్థినికి సూచించారు. మంగళవారం పోలీసు స్టేషన్‌లో రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని బి.ప్రవళికను అభినందించారు. అలాగే విద్యార్థినికి పోటీలకు వెళ్లేందుకు రవాణా కోసం సరిపడా నగదు, బాల్ బాడ్మింటన్ కిట్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల పట్ల ఆసక్తి ఉన్నవారిని ప్రోత్సహించడం అవసరమన్నారు. ప్రవళిక జిల్లా పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆనందకరమని, అక్కడ కూడా సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీ టీవీ రమణ, విద్యార్థిని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీపురం రోడ్డులో చెత్త తొలగింపు

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


లక్ష్మీపురం రోడ్లో చెత్తకుప్పలు తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

చోడవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పరిసరాల పరిశుభ్రత అధ్వానంగా ఉన్న వైనంపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'స్వచ్ఛతా హీ సేవ' కథనంపై స్థానిక మేజర్ పంచాయతీ అధికారులు స్పందించారు. పంచాయతీ ఈవో నారాయణరావు ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని లక్ష్మీపురం వెళ్లే రోడ్డులో పేరుకుపోయిన చెత్త కుప్పలను పారిశుధ్య సిబ్బంది బుధవారం ఉదయం తొలగించడంతోపాటు, ఆ ప్రాంతాన్ని పరిశుభ్రం చేశారు.

గోవాడలో జనావాసాల మధ్య మద్యం దుకాణం

- అధికారులు తప్పుడు నివేదిక
- జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామప్పారావు


గోవాడలో జనావాసాల మధ్య మద్యం తాగుతున్న మందుబాబులు

చోడవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవాడలో జనావాసాల మధ్య మద్యం దుకాణంపై స్థానిక ఎక్సైజ్ అధికారులు జిల్లా ఉన్నతాధికారులకు తప్పుడు నివేదిక సమర్పించారని, దీనిపై తాను కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామప్పారావు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ విషయమై తాను కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే, ఎక్సైజ్ అధికారులు ఎలాంటి విచారణ చేపట్టకుండానే అంతా బాగానే ఉన్నదని నివేదించారన్నారు. గుడికి బడికి దూరంగా ఉందంటూ తప్పుడు నివేదిక ఇవ్వడంతోపాటు, స్థానికులు కూడా మద్యం దుకాణంపై ఎలాంటి అభ్యంతరాలు చెప్పలేదంటూ ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. దీనిపై తాను కలెక్టర్‌ను కలిసి తప్పుడు నివేదిక ఇచ్చిన ఎక్సైజ్ అధికారులపై చర్యలు చేపట్టాలని కోరతానన్నారు. గ్రామంలో బహిరంగ విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరుతామని అల్లం రామప్పారావు అన్నారు.

రెవెన్యూ సభలో వినతుల వెల్లువ


సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎం.లక్ష్మి

బుచ్చెయ్యపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గంటికొర్లాంలో మంగళవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సభలో రీసర్వేలో చోటుచేసుకున్న భూ సమస్యలపై రైతులు తహసీల్దార్ ఎం.లక్ష్మికి వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, రీ సర్వేలో చోటుచేసుకున్న భూ సమస్యలన్నింటిపై క్షుణంగా దర్యాప్తు చేపట్టి, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ శరకాన గౌరమ్మ, ఎంపీటీసీ సభ్యుడు అర్జున అప్పారావు, టీడీపీ నేత శరకాన అప్పలనాయుడు, వీఆర్వో జెవ్వీ రమణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి


నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద నాగులచవితి పండగ సందడి... (ఇన్‌సెట్‌లో) పుట్టలో పాలు పోస్తున్న కౌన్సిలర్ పద్మావతి, టీడీపీ నేత విజయ్,

నర్సీపట్నం నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగులచవితిని ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచే కుటుంబ సమేతంగా పుట్టల వద్దకు చేరుకుని పూజలు చేశారు. నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ఆర్‌అండ్‌బీ బంగ్లా, ఎన్టీఆర్ మినీ స్టేడియం తదితర ప్రదేశాలలోని పుట్టలు వద్ద స్థానికులు కుటుంబ సమేతంగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలో పాలు పోసి నాగేంద్ర స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, 26వ వార్డు కౌన్సిలర్ పద్మావతి కుటుంబ సభ్యులతో కలిసి పుట్టలో పాలుపోసి ప్రత్యేకంగా పూజలు చేశారు.

చోడవరంలో..


పుట్ట వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాజు దంపతులు

చోడవరం: పట్టణంలోని కోటవీధి సమీపంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సతీ సమేతంగా పుట్టలో పాలుపోశారు. మాడుగుల మండలం కేజేపురంలో మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ కుటుంబం చవితి వేడుకల్లో పాల్గొన్నారు.

రోలుగుంటలో..

రోలుగుంట: మండలంలోని కొవ్వూరు, రోలుగుంట, కొమరవోలు, కుసర్లపూడి తదితర గ్రామాల్లో పుట్టల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కొవ్వూరులో ఐటీడీపీ ఇన్‌చార్జి బంటు రాజు, మాజీ సర్పంచ్ కోలిపల్లి ఈశ్వరరావు, రోలుగుంటలో ఎంపీటీసీ సభ్యుడు సుర్ల రామకృష్ణ, కె.నాయుడుపాలెంలో టీడీపీ మండల అధ్యక్షులు గుములూరు చంద్రమౌళి పుట్టల వద్ద పూజలు చేశారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి: మండలంలో అన్ని గ్రామాల్లో నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామాల్లో ఒకే ఇంటి పేర్లు వారంతా కుటుంబాలతో కలిసి పొలాల్లోని పుట్టల పూజలు చేశారు.

చీడికాడలో..

చీడికాడ: మండలంలో పలుగ్రామాల్లో నాగులచవితి పండగను మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని పంట పొలాల్లోని పుట్టల వద్ద చిమ్మిడి, పాలు, గుడ్లు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం టపాసులను కాల్చి సంబరాలు చేసుకున్నారు.

బుచ్చెయ్యపేటలో..

బుచ్చెయ్యపేట: మండలంలో నాగుల చవితిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పొలాల్లో పుట్టల వద్ద పూజలు చేసి పాలు, చమిడి, గుడ్లు వేసి మొక్కులు తీర్చుకున్నారు. వడ్డాదిలో రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు కుటుంబ సమేతంగా పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపీపీ డి.నాగేశ్వరీదేవి పుట్టల వద్ద పూజలు చేశారు.


బుచ్చెయ్యపేట: వడ్డాదిలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న తాతయ్యబాబు

రావికమతంలో..

రావికమతం: మండలంలో నాగుల చవితి పండగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచీ పుట్టల వద్ద పూజలు చేశారు. కొత్తకోటలో సోమిరెడ్డి, ఉగ్గిన వారి కుటుంబాలు ఒకేచోట పుట్టకు పూజలు జరిపారు.

మాకవరపాలెంలో..


మాకవరపాలెంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు


చోడవరం: బంగారమ్మపాలెం వద్ద పుట్ట వద్ద పూజలు

మాకవరపాలెం: మండలంలో నాగుల చవతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి పిల్లలు, పెద్దలు పొలాల్లో ఉన్న పుట్టల వద్దకు చేరుకొని పూజలు చేశారు. నాగేంద్రునికి పాలు, గుడ్లు పట్టలో వేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఏడాది వ్యవసాయం బాగుండాలని రైతులు మొక్కుకున్నారు. నాగుల చవతి సందర్భంగా అన్ని గ్రామాల్లో భక్తులతో పొలాలు కళకళలాడాయి.

గొలుగొండలో..

గొలుగొండ: మండలంలోని పలు గ్రామాల్లో నాగులచవితి పండగ ఘనంగా జరుపుకున్నారు. జోగంపేట, పాకలపాడు, చీడిగుమ్మల, ఏటిగైరంపేట, కొత్తమల్లంపేట, రావణాపల్లి, కొత్తఎల్లవరం, పాతమల్లంపేట, గుండుపాల గ్రామాల్లోని పొలాల్లో ఉన్న పుట్టల్లో పాలుపోసి నాగేంద్రుడిని భక్తిశ్రద్ధలతో పూజించుకున్నారు.


గొలుగొండ పంట పొలాల్లో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మాడుగులలో..

మాడుగుల: మండలంలో నాగుల చవితి వేడుకలను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పుట్టల వద్దకు కుటుంబ సమేతంగా వెళ్లి నాగేంద్రునికి ప్రత్యేక పూజలు చేశారు. బాణసంచా వెలిగించారు.

కృష్ణాదేవిపేటలో..

కృష్ణాదేవిపేట: కృష్ణాదేవిపేట, చోద్యం, సిహెచ్.నాగాపురం, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట, కొంగసింగి తదితర గ్రామాల్లో నాగులచవితి పండగ వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి భక్తులు పుట్టల వద్దకు వెళ్లి పూజలు నిర్వహించారు. ఏఎల్.పురం అల్లూరి పార్కు వద్ద ఓ పొలంలో మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి కుటుంబ సభ్యులతో పూజలు చేశారు.

మాస్టారు మృతితో పెదగోగాడలో విషాద ఛాయలు


మృతదేహానికి నివాళులర్పిస్తున్న వెలమ సంఘం నేత రాంబాబు

చీడికాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ(99) మంగళవారం మృతి చెందడంతో పెదగోగాడలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, ఉత్తరాంధ్ర వెలమ సంఘం అధ్యక్షుడు నరవ రాంబాబు, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరవాడ సింహాచలంనాయుడు, మాజీ ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, అభిమానులు వందలాది మంది వచ్చి నివాళులర్పించారు. మాస్టారు మృతితో గ్రామంలో నాగులచవితిని జరుపుకోలేదు.

రెడ్డి మృతి తీరనిలోటు: ఎమ్మెల్యే రాజు

చోడవరం: మాజీమంత్రి రెడ్డి సత్యనారాయణ చోడవరం, మాడుగుల నియోజకవర్గాల ప్రజలకు తీరనిలోటని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అభిప్రాయం వ్యక్తం చేశారు. రెడ్డి సత్యనారాయణ ఆదర్శప్రాయ రాజకీయ నేతగా అభివృద్ధిని కాంక్షించే మంచి వ్యక్తిగా ఈ ప్రాంత ప్రజల్లో చెరగని ముద్ర వేశారన్నారు. సాగునీటి వనరుల అభివృద్ధి కోసం ఆయన సాగించిన కృషి వల్ల ఎంతోమంది రైతులకు జీవనాధారం కల్పించారన్నారు.

ఈర్లె సంతాపం

మాజీమంత్రి రెడ్డి సత్యనారాయణ మృతి పట్ల బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామమూర్తి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. విలువలు కలిగిన నేతగా రెడ్డి సత్యనారాయణ అందరికీ ఆదర్శప్రాయుడిగా ఉన్నారన్నారు.

దేవరాపల్లిలో..

మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని టీడీపీ నాయకులు అన్నారు. మాడుగుల నియోజకవర్గ ఎమ్మెల్యేగా రెడ్డి సత్యనారాయణ ఐదు సార్లు, మంత్రిగా పదవి చేపట్టి, బ్రిడ్జిలు, రోడ్లు, కార్యాలయ భవనాలు, తెనుగుపూడి గురుకుల కళాశాల వంటి ఎన్నో పనులు చేపట్టారన్నారు. పార్టీలకతీతంగా అందర్నీ కలుపుకొంటూ ఆయనకు సాటి ఎవ్వరూ లేరన్న విధంగా అభివృద్ధి చేశారు.

ప్రారంభానికి సిద్ధం చేసిన శిలాఫలకం ధ్వంసం

- సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తుల దుశ్చర్య
- అభివృద్ధిని ఓర్వలేక వైసీపీ కార్యకర్తలే ధ్వంసం చేశారని టీడీపీ నాయకుల ఆరోపణ


ప్రారంభానికి ముందు ఏర్పాటు చేసిన శిలాఫలకం


సోమవారం రాత్రి ధ్వంసమైన శిలాఫలకం

రోలుగుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంకేపట్నం నుంచి గిరిజన గ్రామమైన కొరుప్రోలుకు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.5 కోట్ల నిధులను మంజూరు చేసింది. దీనిలో భాగంగా స్థానిక ఎంకేపట్నం గ్రామ టీడీపీ నాయకులు మడ్డు పైడితల్లినాయుడు తదితరులు ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజుతో ప్రారంభించడానికి సన్నాహాలు చేశారు.

దీని కోసం శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. అయితే సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. సోమవారం రాత్రి గ్రామానికి చెందిన కొంత మంది యువకులు ఆ శిలాఫలకం వద్ద మందు పార్టీ చేసుకున్నారని టీడీపీ నాయకుడు మడ్డు పైడితల్లినాయుడు తెలిపారు. ఆ శిలాఫలకంలోవైసీపీ నాయకులైన జడ్పీటీసీ సభ్యురాలు పోతల లక్ష్మీరమణమ్మ, సర్పంచ్ నూకాలమ్మ, ఎంపీటీసీ నల్లి బోడమ్మ పేర్లు తొలగించకుండా ఇతర టీడీపీ నాయకుల పేర్లను ధ్వంసం చేశారు.

గ్రామానికి చెందిన వైసీపీ నాయకులే కావాలనే టీడీపీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వ లేక శిలాఫలకాన్ని ధ్వంసం చేశారని ఆరోపించారు. తక్షణమే శిలాఫల కాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

శాంతియుత ధర్నాను విజయవంతం చేయండి: మాజీ ఎమ్మెల్యే గణేశ్



నర్సీపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గబ్బాడ డిపోలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను పట్టిచ్చిన వైసీపీ నాయకులపై పోలీసులు అక్రమ కేసులకు నిరసనగా స్థానిక పోలీస్ వద్ద తలపెట్టిన శాంతియుత నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గత నెల 25 తేదీ రాత్రి గబ్బాడ డిపోలోని ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకోవడం జరిగిందన్నారు. పట్టుకున్న లారీలను పోలీసులు వదిలేయమే కాకుండా పార్టీ నాయకులపై అక్రమంగా కేసులు పెట్టారని ఆరోపించారు. ఈ అక్రమ కేసులకు నిరసనగా బుధవారం నర్సీపట్నం పోలీస్ స్టేషన్ ఎదుట శాంతియుత ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పెదబొడ్డేపల్లి పార్టీ కార్యాలయం వద్దకు వస్తే అక్కడ నుంచి పోలీస్ స్టేషన్‌కి బయలుదేరి వెళదామని ఆయన పిలుపునిచ్చారు.

మాజీ ఎమ్మెల్యే ధర్నాకు పిలుపునివ్వడం సిగ్గుచేటు: టీడీపీ నేత రామునాయుడు


మాట్లాడుతున్న రామునాయుడు

మాకవరపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారన్న అసత్య ఆరోపణలతో మాజీ ఎమ్మెల్యే గణేశ్ ధర్నాకు పిలుపునివ్వడం సిగ్గుచేటని టీడీపీ సీనియర్ నేత, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, అల్లు రామునాయుడు ధ్వజమెత్తారు. వైసీపీ ప్రభుత్వంలో భీమబోయినపాలెంలో టీడీపీ కార్యకర్తలపై అనేక అక్రమ కేసులను మాజీ ఎమ్మెల్యే పెట్టించలేదా అని ప్రశ్నించారు. అధికారం పోయిన తర్వాత అక్రమ కేసులపై మాట్లాడేందుకు సిగ్గులేదా అని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తే ఓర్వలేక అసత్య ప్రచారాలు మొదలు పెట్టారని ఆరోపించారు. ఇప్పటికైనా అసత్య ఆరోపణలు మానుకోవాలని ఆయన హితవు పలికారు.

విద్యుదాఘాతంతో రెండు పాడి ఆవులు మృతి


మృతి చెందిన పాడి ఆవులు

కె.కోటపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడువాడలో విద్యుత్ వైర్లు తెగి పడడంతో రెండు ఆవులు మృతి చెందాయి. మంగళవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అమరపల్లి నూకేశ్వరరావుకు చెందిన కళ్లానికి త్రీఫేజ్ విద్యుత్ కింద ఉంది. అప్పుడప్పుడు ఈ వైర్లు తెగి పడడం పరిపాటే. కళ్లం బయట కట్టి ఉంచిన ఈ ఆవులపై ఒక వైరు పడడంతో మృతి చెందినట్టు బాధితుడు తెలిపారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. బాధితుడికి నష్టపరి హారం ఇప్పించాలని ఈపీడీసీఎల్ అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.

రోడ్డు పనులు చేపట్టాలని డోలీలతో పాదయాత్ర


డోలీలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

రోలుగుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అర్ల నుంచి జాజులబంద వరకు రోడ్డు పనులు పూర్తిచేయాలని కోరుతూ మంగళవారం గిరిజనులు డోలీలు పట్టుకుని 4 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టారు. అర్ల పంచాయతీ శివారు పిత్రిగెడ్డ, నీళ్లబంద, జాజులబంద గ్రామాల్లో 250 జనాభా నివసిస్తున్నారు. 2023-24 ఏడాదిలో పాడేరు ఐటీడీఏ ఉపాధి హామీ పథకం కింద ఏడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేసింది. ఇందుకు అటవీ శాఖ అనుమతులు కూడా తీసుకున్నారు. దీనికి సంబంధించి రూ.26 లక్షలు ఖర్చు చేసి పనులు చేపట్టి, తర్వాత నిలిపివేశారు. తక్షణమే పనులు చేపట్టి పూర్తిచేయాలని కోరుతూ పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో మర్రి కామేష్, కొండాతాంబేలి, వెంకట్రావు, గెమ్మెలి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఆశాలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి'


రావికమతం పీహెచ్‌సీ వద్ద భోజన సమయంలో ఆందోళన చేస్తున్న ఆశాలు

రావికమతం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఆశాలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ మంగళవారం ఆశాలు స్థానిక పీహెచ్‌సీ వద్ద భోజన విరామం సమయంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆశాల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వజ్రపు సత్యవతి మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం పలు జీవో అమలుకు అంగీకరించిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన జీవో హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీహెచ్ఓ హేమసుందరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ లీడర్ ఎస్.లక్ష్మి, జి.పార్వతి, జె.జగ్గమ్మ, కె.సంధ్య, కె.రమణమ్మ, పి.రమా, కె.రమా, ఉమ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు మౌనిక ఎంపిక


మౌనిక

నర్సీపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని బుస్వాల్‌లో ఈ నెల 6 నుంచి 10 వరకు జరుగుతున్న ఆల్ ఇండియా విమెన్ నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో నర్సీపట్నానికి చెందిన బొంతు మౌనిక 80 కిలోల విభాగంలో పాల్గొంటుంది. మౌనిక ఇటీవల గౌహతిలో జరిగిన జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలలో గోల్డ్‌మెడల్, హర్యానాలో సిల్వర్ మెడల్ సాధించినట్టు కోచ్ అబ్బు తెలిపారు. మంగళవారం మౌనిక మహారాష్ట్ర బయలుదేరారని, గోల్డ్‌మెడల్‌తో తిరిగి వస్తుందన్న నమ్మకం ఉందని నింజాస్ అకాడమీ డైరెక్టర్లు, కుటుంబీకులు, కోచ్ చెప్పారు.


పాడేరు సమీప తోటల్లో పుట్టల వద్ద పూజలు చేస్తున్న భక్తులు


శివుని సన్నిధిలో భక్తిగీతాలు ఆలపిస్తున్న రాజస్థానీ మహిళలు


నడింపాలెంలో పుట్టల వద్దకు వెళ్తున్న గ్రామస్థులు

భక్తి శ్రద్ధలతో నాగేంద్రునికి పూజలు

- పుట్టల వద్ద బారులుతీరిన భక్తులు
- కిటకిటలాడిన ఆలయాలు

పాడేరురూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాగుల చవితి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కుటుంబ సమేతంగా భక్తులు సమీపంలో ఉన్న పుట్టల వద్దకు చేరుకుని పాలు, గుడ్లు, సిమ్మిలి, చలివిడి, నాగుల తువ్వాళ్లను సమర్పించి భక్తి శ్రద్ధలతో పూజలను చేపట్టారు. అనంతరం బాణా సంచాతో ఆనందంగా జరుపుకున్నారు. పాడేరులో సమీపంలో లేక పోవడంతో కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతాలకు వెళ్లి కాఫీ తోటలు, ఇతర చోట్ల పుట్టల వద్దకు వెళ్లారు. అనంతరం పట్టణంలోని శివాలయాలను సందర్శించి పరమేశ్వరునికి పూజలు చేపట్టారు. అర్చకులు రామంపంతులు శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టారు. పాడేరులో నివాసం ఉం టున్న రాజస్థాన్ మహిళలు ఉమానీలంతేశ్వరుని ఆలయానికి చేరుకొని శివలింగానికి పూజలు చేపట్టారు. పుట్ట వద్ద పూజలు చేపట్టి రాజస్థాని ఆచారం మేరకు భక్తి గీతాలను ఆలపించి నాగేంద్రునిపై వారికి ఉన్న భక్తిని చాటుకున్నారు. భక్తులకు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో ఆలయ ఆధ్యాత్మిక బృంద సభ్యులు కొట్టగుళ్లి రామారావు, రాజబాబు, బాబూరావు, శ్రీనివాస్ కుమార్, కొండలరావు, వెంకటరత్నం తదితరులు ప్రసాదం పంపిణీ చేపట్టారు.

కొయ్యూరు: గిరిజన పల్లెల్లో నాగులచవితిని సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. రైతులు పంట కాలువల గట్లు, పుట్టలను దాటుకుంటూ వెళ్తుంటారు. ఆ సమయంలో నాగ దేవత వల్ల ఏదైనా అపాయం రాకుండా ఉండేందుకు వీలుగా భక్తి శ్రద్ధ లతో నాగుల చవితిని నిర్వహించటం ఆనవాయితీ. అలాగే వివాహం కాని వారు ఈ రోజున పుట్టలో పాలు పోసి ఉపవాసం ఉంటే పెళ్లి జరుగుతుందనే నమ్మకం గ్రామాల్లో ఉంది. ఈ నేపథ్యంలో పొలాలు, పం తల్లో గల పుట్టల ముందు జనం బారులు తీరి కనిపించారు.

సీలేరు: జీకేవీధి మండలం సీలేరు, ధారకొండల్లో నాగులచవితిని ఘనంగా జరిపారు. అటవీప్రాంతంలోని పుట్టల వద్ద కు వెళ్లి పూజలు చేశారు. అనంతరం పుట్టలో పాలు, గుడ్లను వేసి తమ భక్తిని చాటారు. సీలేరు మారెమ్మ ఆలయం వద్ద పుట్ట వద్ద, నాగదేవత ఆలయం వద్ద పుట్ట వద్దకు భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో భక్తులు పుట్టలో పాలు, గుడ్లను వేశారు. అనంతరం మారెమ్మను దర్శించుకున్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ, కురిడి, అరకు గ్రామాల్లో నాగుల చవితిని ఘనంగా జరుపుకున్నారు. కించుమండలో నాగులమ్మ గుడి వద్ద ఉదయం 6 గంటలకే అయ్యప్ప స్వాములు పుట్టలో పాలు పోసి, పండ్లు బెల్లం, గుడ్లు సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు.

అనంతగిరి/హుకుంపేట: గ్రామాల్లో నాగుల చవితి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కుటుంబ సమేతంగా నైవేద్యం సమర్పించి, పుట్టల్లో పాలు పోశారు.

గూడెంకొత్తవీధి: మండల ప్రజలు నాగులచవితిని జరుపుకున్నారు. మంగళవారం ఉదయం నుంచే భక్తులు పుట్టల్లో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. మండల కేంద్రం అద్దరవీధి, పూజారిపాకలు, గూడెంకాలనీ పుట్టల వద్దకు భారీగా భక్తులు తరలివచ్చారు.


జీకే వీధిలో పూజలు చేస్తున్న భక్తులు


హుకుంపేటలో పుట్టలో పాలు, గుడ్లు వేస్తున్న దృశ్యం


సీలేరు నాగమ్మ ఆలయంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు


అనంతగిరిలో..

104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి


గోమంగి పీహెచ్‌సీలో డాక్టర్ చైతన్యకు వినతి పత్రం అందిస్తున్న 104 సిబ్బంది

పెదబయలు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అరబిందో యాజమాన్యం ద్వారా గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న 104 సిబ్బందికి మూడు నెలల బకాయి వేతనాలను తక్షణమే చెల్లించి, తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని 104 ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు చిట్టపులి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం గోమంగి పీహెచ్‌సీలో డాక్టర్ చైతన్యకు వినతిపత్రాన్ని అందించారు. ఈకార్యక్రమంలో పైలట్ చెండా జగన్,మునగ అజీత్ కుమార్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ చింతపల్లి మండలాధ్యక్షుడిగా సంజీవరావు

చింతపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడిగా కోరాబు సంజీవరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు జిల్లా అధ్యక్షుడు యూవీ గిరి తెలిపారు. మంగళవారం మండల పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈసందర్భంగా ఉపాధ్యాయులు అధ్యక్షుడిగాపాటూ ప్రధాన కార్యదర్శిగా చింతర్ల మధుబాబు, రాష్ట్ర కౌన్సెలర్‌గా కొర్రు మత్స్యలింగంని ఎన్నుకున్నట్టు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా కౌన్సెలర్ కార్తిక్, నాయకురాలు యశోద పాల్గొన్నారు.

డీఎస్సీ మోడల్ పరీక్ష


విజేతకు నగదు ఇస్తున్న నిర్వాహకులు

చింతపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండ కేంద్రంలో కింగ్స్ ఆర్మీ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం డీఎస్సీ మోడల్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు గిరిజన ప్రాంతంలోని 35 మంది యువతీ, యువకులు హాజరయ్యారు. వీరిలో ప్రథమ స్థానంలో నిలిచిన షేక్ రెహమా తునీషాకు రూ. 10వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జల్లి బాబ్జీకి రూ. 5వేల నగదునునిర్వాహకులు అందజేశారు. ఈకార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు జోసెఫ్, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

సామాజిక శిక్షణ తరగతులు విజయవంతం చేయండి

ముంచంగిపుట్టు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అరకులోయలో ఈ నెల 9, 10వ తేదీల్లో నిర్వహించనున్న జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతుల కార్యక్రమానికి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కిశోర్ కోరారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి మాదవ్, జేఏసీ నాయకుడు పూజారి సురేష్ పాల్గొన్నారు.

'ఆశా'లకు 'ఆయుష్'పై శిక్షణ

సీలేరు, నవంబరు 5: జీకేవీధి మండలం సీలేరు పీహెచ్‌సీలో మంగళవా రం ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఇతర వైద్య సిబ్బందికి ఆయుష్ కార్యక్రమంపై వైద్యాధికారి ఎస్‌కే మస్తాన్‌వల్లీ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిశువు పెరుగుదల, ఆరోగ్య అభివృద్ధి, వారికి సక్రమించే న్యూమోనియా నియంత్రణ తదితర అంశాలపై వైద్యాధికారి అవగాహన కల్పించారు.


వెయ్యి ఎకరాల్లో మల్బరీ సాగుకు చర్యలు

- పర్యాటక ప్రదేశాల్లో పారిశుధ్యం, ట్రాఫిక్‌పై ప్రత్యేక శ్రద్ధ
- కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన మైక్రో ఇరిగేషన్ పీడీ రహీమ్

పాడేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వెయ్యి ఎకరాల్లో మల్బరీ సాగు విస్తరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. మైక్రో ఇరిగేషన్, సెరీకల్చర్, టూరిజం, స్వయం ఉపాధి పథకాల యూనిట్ల మంజూరు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మా ట్లాడారు. ఏడాదికి రూ. లక్ష ఆదాయం వచ్చే పట్టుపురుగుల పెంపకంపై దృష్టిసారించాలన్నారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలో మల్బరీ సాగు, పట్టు పురుగుల పెంపకాన్ని విస్తరించి రైతుల కుఆదాయం పెంపునకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే, పది వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలు పెంపకాన్ని ప్రోత్సహించాలని, రైతులకు పెద్ద ఎత్తున మైక్రో ఇరిగేషన్ యూనిట్లు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. పోషకా హార లోపం ఉన్న చిన్నారులపై ఐసీడీఎస్ అధికారు లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కిశోర వికాసం పథకంలో బాల, బాలికలకు క్రీడలు నిర్వహించాలని స్పష్టం చేశారు. అలాగే, లక్‌పతి దీదీ పథకంలో లబ్ధిదారులకు స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేయాలని లీడ్‌బ్యాంక్ మేనేజర్‌ను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో ట్రాఫిక్, భద్రతా, పారిశుధ్యంపై చర్యలు చేప ట్టాలని కలెక్టర్ సూచించారు. అలాగే పర్యాటక ప్రదేశాల పరిధిలో గ్రామ, మండల, ఐటీడీఏ స్థాయిల్లో కమిటీలు ఏర్పాటుపై వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పర్యాటక సర్క్యూట్‌పై ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు వి.అభిషేక్, కె.సింహాచలం, అపూర్వభరత్, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ రహీమ్, ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, డీపీవో బి.లవరాజు, అండ్‌బీ ఈఈ బాల సుందరంబాబు, సీపీవో పట్నాయక్, ఎల్‌డీఎం మాతునాయుడు, సెరీకల్చర్ ఏడీ అప్పారావు, జిల్లా పర్యాటకాధికారి జి.దాసు, డ్వామా పీడీ శివయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జవహర్ కుమార్ పాల్గొన్నారు.

సీలేరు డ్యామ్ నుంచి వృథాగా పోయిన నీరు


ఎంబాక్‌మెంట్ పైనుంచి వృథాగా పోతున్న నీరు

సీలేరు, నవంబరు 5 : సీలేరు జలవిద్యుత్ కేంద్రానికి రెగ్యులేటర్ డ్యామ్ నుంచి విడుదలయిన నీరు మంగళవారం సాయంత్రం ఎంబాక్‌మెంట్ పై నుంచి వృథాగా పోయింది. దీంతో చింతపల్లిక్యాంప్‌నకు చెందిన 42 మంది గిరిజనులు అవతల ఒడ్డున చిక్కుకున్నట్టు సమాచారం తెలుసుకున్న జెన్‌కో అధికారులు వారిని సురక్షితంగా ఇవతలకు చేర్చారు.సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే సమయంలోనే ఎన్ని యూనిట్లు వినియోగంలో ఉంటే వాటికి సరిపడిన నీరు మాత్రమే రెగ్యులేటర్ డ్యామ్ వద్ద నుంచి విధుల్లో ఉన్న జెన్‌కో సిబ్బంది విడుదల చేస్తారు. సాయంత్రం సమయంలో యూనిట్లను నిలిపివేయడంతో రెగ్యులేటర్ డ్యామ్ గేట్లను కిందికి దించాలని జలవిద్యుత్ కేంద్రం నుంచి సమాచారం వచ్చినప్పటికీ గేట్లు వద్ద సాంకేతిక లోపాలు తలెత్తి గేట్లు కిందకు రాలేదు. దీంతో రెగ్యులేటర్ డ్యామ్, జలవిద్యుత్ కేంద్రానికి మధ్యన భారీగా నీరు చింతపల్లి క్యాంప్ వైపు ప్రవహించింది. అయితే, చింతపల్లి క్యాంప్‌నకు చెందిన 42 మంది గిరిజనులు పక్కనే ఉన్న చంద్రుపల్లి, లైకన్‌పూర్, పసువులలంక గ్రామాలకు వరికోతలకు వెళ్లి సాయంత్రం గ్రామానికి వస్తుండగా...ఎంబాక్‌మెంట్ నుంచి నీరు కాలువలో ఉధృతంగా ప్రవహిస్తున్నట్టు గమనించి ఒడ్డున నిలిచిపోయారు. ఫోన్‌లో గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తుల సమాచారం మేరకు సీలేరు కాంప్లెక్సు జెన్‌కో ఇన్ చార్జి ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి తమ సిబ్బందితో చింతపల్లి క్యాంప్ చేరుకుని ఇద్దరు ఈతగాళ్లను రెండు పడవలతో పంపించి చిక్కుకున్న 42 మం దిని రెండుగంటల పాటు శ్రమించి చింతపల్లి క్యాంప్‌న కు సురక్షితంగా చేర్చారు. నీటి ప్రవాహాన్ని గమనించకుంటే పెను ప్రమాదం జరిగేదని గిరిజనులు చెబుతున్నారు.


పరిస్థితిని సమీక్షిస్తున్న జెన్‌కో అధికారులు

గార్డెన్ సుందరీకరణ పనులు వేగవంతం

- ఐటీడీఏ పీవో అభిషేక్


పద్మాపురం గార్డెన్ సుందరీకరణ పనుల వివరాలను తెలుసుకుంటున్న పీవో అభిషేక్

అరకులోయ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పద్మాపురం గార్డెన్ సుందరీకరణ పనులు ఈనెల 15లోగా పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అధికారులను అదేశించారు. గార్డెన్ పర్యాటకులను మరింత ఆకట్టుకునేలా పలు అభివృద్ధి పనులను ప్రారంభించామన్నారు. ఈ పనులు ప్రస్తుత పర్యాటక సీజన్‌లో పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా వేగవంతం చేయాలని గార్డెన్ ఇన్‌చార్జి బొంజిబాబును, టీడబ్ల్యూ ఈఈ వేణుగోపాల్, ఏఈఈ అభిషేక్‌లను ఆదేశించారు. ఈ పనులు జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. మరుగుదొడ్లను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. గార్డెన్‌లో ఉన్న సీసీ రోడ్డును పరిశీలించి పలు సూచనలు చేశారు. హట్ ఎయిర్ బెలూన్ ఉన్న ప్రాంతం లో ఫెన్సింగ్, అవసరమైన షెడ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ దీపాల పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హట్ ఎయిర్‌బెలూన్ నిర్వాహకుడు గల్ల సంతోశ్ పాల్గొన్నారు.

నేత్ర శస్త్ర చికిత్సలకు 15 మంది ఎంపిక


వాహనంలో రోగులను విశాఖ తరలిస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీహెచ్‌సీలో మంగళవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విశాఖ క్వీన్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 87 మందికి పరీక్షలు నిర్వహించి, 15 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేసి ప్రత్యేక వాహనంలో విశాఖ తరలించారు. ఈ సందర్భంగా ఆప్తాలిమిక్ అసిస్టెంట్ కిశోర్ కుమార్ మాట్లాడుతూ శస్త్ర చికిత్సల అనంతరం వారిని తిరిగి తీసుకువస్తామన్నారు. వైద్య నిపుణులు గీతాంజలి, శ్యాంప్రసాద్, రమేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీలకు స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి



అరకులోయలో నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు, గిరిజన సంఘం నేతలు

అరకులోయ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జనరల్ డీఎస్సీతోపాటు ఆదివాసీలకు ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా ఉపాధ్యాయులను భర్తీ చేయాలని ఆదివాసీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు అరకులోయలో నిరుద్యోగ యువతీ, యువకులు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా ఆదివాసీ గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి బాలదేవ్, మండల అధ్యక్షుడు చినబాబుఆదివాసీలకు 100 శాతం రిజర్వేషన్ అమలు చే యాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో గిరిజ సంఘం ప్రతినిధులు మగ్గన్న కృష్ణంరాజు, జానీబాబు పాల్గొన్నారు.

చింతపల్లి: షెడ్యుల్డ్ ప్రాంతంలో ఉపాధ్యాయ పోస్టులు శతశాతం ఆదివాసీ అభ్యర్థులతో భర్తీ చేయాలని గిరిజన ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు బొడ గంగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరుద్యోగులు, ఆదివాసీల ఆవేదన దీక్షను చేపట్టారు. గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యూవిగిరి, నాయకులు కుడుముల కాంతారావు, కేవీ రమణ పాల్గొన్నారు.

ఆదివాసీలకు శతశాతం రిజర్వేషన్ కల్పించాలి

గూడెంకొత్తవీధి: గిరిజన ప్రాంతంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో శతశాతం ఆదివాసీలకు రిజర్వేషన్ కల్పించాలని నిరుద్యోగ యువత సంఘం నాయకుడు సోమేశ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని రింతాడ గ్రామ పంచాయతీ కేంద్రంలో నిరుద్యోగ యువత ఆదివాసీ ఆవేదన దీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో నిరుద్యోగులు నారాయణరావు, సీమన్, గాబ్రియేల్, రాజబాబు, గోపాలరావు, బీజేపీ నేత ప్రభాకరరావు పాల్గొన్నారు.

జీవో 3 అమలు చేయాలి: ఎమ్మెల్సీ


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కుంభా రవిబాబు

పాడేరు రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా జీవో 3 అమలు చేయాలని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనులు సర్వాధికారాలు కలిగి ఉంటారన్నారు. అటువంటి ప్రాంతాల్లోనే చట్టాలు అమలుకాకుంటే గిరిజనులకు అన్యాయం జరగక తప్పదన్నారు. ఈ సమావేశంలో ఎంపీ జి.తనూజారాణి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ రవిబాబు, ఎంపీ తనూజారాణి, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజులు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్‌ను కలిసి గిరిజన ప్రాంతంలో పలు సమస్యలు వివరించారు.

సాంస్కృతిక ఉత్సవంలో ఈఎంఆర్ విద్యార్థులు సత్తా


విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్

చింతపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అరకులోయలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సాంస్కృతిక ఉత్సవంలో స్థానిక ఏకలవ్య ఆదర్శ నివాసానుబంధ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఎనిమిది మంది వివిధ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. హిందీ వక్తృత్వ సీనియర్స్ విభాగంలో గుల్ల చరణ్ లిఖిత్ ప్రథమ స్థానం, జూనియర్స్ విభాగంలో కె. అమృత, ఇంగ్లీష్ డిబెట్‌లో మోహన్‌సాయి ప్రథమ స్థానం, ఇంగ్లీష్ స్పీచ్‌లో మీనాక్షి ప్రథమ స్థానం, సైన్స్ క్విజ్‌లో గాయత్రి, చందనలు ప్రథమ స్థానం, సింగింగ్‌లో ధరణి ప్రథమ స్థానం, బొమ్మల తయారీలో బి. సురేంద్ర, ఇంగ్లీష్ డిబేట్ డబుల్ విభాగాల్లో చరణ్ తేజ, మోహన్ సాయి ప్రథమ స్థానాల్లో నిలిచారు. విజేతలకు మంగళవారం నిర్వాహకులు ధ్రుపత్రాలు, బహుమతులను అందజేశారు. ఈ విద్యార్థులను ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్ అభినం దించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయంత్ హరి, నాయుడు, హర్ష పాల్గొన్నారు.

ఇలాగేనా మధ్యాహ్న భోజనం నిర్వహణ?

- ఎండీఎం ఏడీ అప్పారావు ఆగ్రహం


వంటలను పరిశీలిస్తున్న ఏడీ అప్పారావు

గూడెంకొత్తవీధి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) సహాయక సంచాలకులు (ఏడీ) గిడ్డి అప్పారావు హెచ్చరించారు.మంగళవారం మండలంలోని పెదవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నేరళ్లబంద, లక్కవరపేట, కొడింగి ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్నభోజనాలను పరిశీలించారు. మెనూ పాటించకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. మధ్యాహ్నభోజన పథకం అమలులో పలు లోపాలు గుర్తించామన్నారు. కాలం చెల్లిన రాగి పిండి వినియోగిస్తున్నారని, పాఠశాల పునఃప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా చిక్కీలు సరఫరా చేయలేదన్నారు. గుడ్లు కూడా సకాలంలో అందడంలేని నిర్వాహకులు చెబుతున్నారన్నారు. ఎంఈవో నిర్లక్ష్యం కారణంగానే భోజన పథకం సమర్థవంతంగా అమలుకావడంలేదన్నారు. దీనిపై రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఎంఈవోని కోరనున్నట్టు చెప్పారు. గుడ్లు, చిక్కీలను సరఫరా చేసే ఏజెన్సీలకు బిల్లులు నిలిపివేస్తామన్నారు.

సచివాలయ ఉద్యోగుల మండల కమిటీ ఎన్నిక


మండల నూతన కమిటీ సభ్యులు

ముంచంగిపుట్టు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సచి టవాలయాల ఉద్యోగుల నూతన కమిటీ ఎన్నిక మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. సంఘం అధ్యక్షుడిగా కొమ్ము సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా పాంగి మనోజ్, గౌరవ అధ్యక్షులుగా నరేశ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా రమేష్, డాలిమ్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా గణపతి, వరుణ్‌బాబు, భార్గవి, సుజాత, కోశాధికారిగా రుక్మిణి, వీరయ్య, సంధ్య, రాజుబాబు, తరుణ్, బుద్దలతో పాటు పలువురు సభ్యులుగా ఎంపికయ్యారు.

'అక్రమార్కులను ఎమ్మెల్యే వెనకేసుకురావడం తగదు'


మాట్లాడుతున్న సర్పంచ్ బుజ్జిబాబు

గూడెంకొత్తవీధి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):గిరిజన గ్రామాల్లో సోలార్ ప్లాంట్ల సామగ్రిని అక్రమంగా దోచుకున్న వైసీపీ నాయకులను పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు వెనకేసుకురావడం దారుణమని దేవరాపల్లి సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు విమర్శించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం శివారు గిరిజన గ్రామాల ఆదివాసీలకు విద్యుత్ సదుపాయం కల్పనకు 2014-18 కాలంలో సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. క్రమంగా సోలారు విద్యుత్ ప్లాంట్లు కలిగిన గ్రామాలకు సైతం గ్రిడ్ విద్యుత్ కనెక్షన్లు ఈపీడీసీఎల్ అధికారులు ఏర్పాటు చేశారన్నారు. దీంతో కొంత మంది వైసీపీ నాయకులు గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ఏర్పాటు చేసిన సోలార్ ప్లేట్లు, బ్యాటరీలను రాజమండ్రికి చెందిన ఓ వ్యాపారికి విక్రయించి రూ.లక్షల్లో దోచుకున్నారన్నారు. అ క్రమాలకు పాల్పడిన వైసీపీ నాయకులకు ఎమ్మెల్యే మద్దతివ్వడం విచారకరమన్నారు. ఈ కుంభకోణంపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామన్నారు.

బదిలీ సీఐకు సన్మానం


సీఐ రమేశ్, పక్కన డీఎస్పీ షహబాజ్ అహమ్మద్, తదితరులు

చింతపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో పనిచేసే అవకాశం కలగడం తన అదృష్టమని బదిలీపై వెళుతున్న సీఐ కె. రమేశ్ అన్నారు. మంగళవారం రాత్రి ఆయనకు పోలీసులు సన్మాన సభను ఏర్పాటు చేశారు. రమేశ్‌ని స్థానిక డీఎస్పీ షేక్ షహబాజ్ అహమ్మద్, పోలీసులు సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గిరిజనుల ప్రేమాభిమానాలు మరువలేనివన్నారు. రెండేళ్లలో జిల్లాలోనే అత్యధిక గంజాయి కేసులు నమోదు చేశామన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక సీఐ ఎం. వినోద్‌బాబు, కొయ్యూరు సీఐ వీవీ రమణ, ఎస్సై వెంకట రమణ పాల్గొన్నారు.

సీలేరు ఎస్ఐగా రవీంద్ర



సీలేరు: జీకేవీధి మండలం సీలేరు పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా కే రవీంద్ర మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన జె రామకృష్ణను ముంచంగిపుట్టు బదిలీ కాగా, అక్కడ ఎస్ఐగా కొనసాగుతున్న రవీంద్రను సీలేరుకు అధికారులు బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూ అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దొంగలు హల్‌చల్


దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

ముంచంగిపుట్టు, నవంబరు 5 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. నాలుగు రోడ్ల కూడలి సమీపంలో గల ఒక కిరణా షాప్‌లోకి చొరబడి కిరాణా సామగ్రి తోపాటు రూ. 15వేలు ఎత్తుకుపోయారు. మంగవారం ఉదయం కిరాణా షాప్ తెరిచేందుకు వచ్చిన యజమాని కిశోర్ చోరీ జరిగినట్టు గుర్తించారు. దొంగలు షాప్‌లోపల ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అలాగే ప్రధాన రహదారికి అనుకొని ఉన్న మరో రెండు దుకాణాల్లో చోరీకి ప్రయత్నించారు. కుక్కలు మొరగడంతో మెల్లగా జారుకున్నారు. స్థానిక ఎస్ఐ జె.రామక్రిష్ణ చోరీ జరిగిన షాప్ వద్దకు చేరుకొని పరిశీలించారు. దొంగతనానికి వినియోగించిన కట్టర్లను, ఇనుప రాడ్డులను పోలీసులు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. త్వరలో దొంగలను పట్టుకుంటామన్నారు.

హుకుంపేటలో చలి పులి

హుకుంపేట నవంబరు5 ఆంధ్రజ్యోతి; మండలంలో రోజు రోజుకు చలి పెరిగిపోతోంది. ప్రజలు ఉదయం 9 గంటలైనా బయటలకు వచ్చేందుకు భయందోళన పడుతున్నారు. పాడేరు అరుకు ప్రధాన రహదారిలో ప్రయాణించే వాహన చోదకులు మంచుతో పగటివేళలోనూ లైట్లు వేసి మరి ప్రయాణాలు సాగిస్తున్నారు. మంచుతో గిరిజనులు పనులు వెళ్లేందుకు జంకుతున్నారు. మంటల వద్ద చలికాచుకుంటున్నారు.


ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న భక్తులు

భోగలింగేశ్వరస్వామి ఊంజల్‌సేవ

అనకాపల్లి టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక గవరపాలెం భోగలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి సర్వకామదాంబ సమేత భోగలింగేశ్వర స్వామి ఊంజల్‌సేవ భక్తిశ్రద్ధలతో జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య బుద్ధ రమణాజీ, సరోజిని దంపతులు ఊంజల్‌సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు చేసిన భరతనాట్యం భక్తులను ఆకట్టుకుంది. అర్చకులు భీమేశ్వరరావు, వేణు, గోపి, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

వారపు సంత వెలవెల


వినియోగదారులు లేక బోయిబోయిన దుకాణాలు

పరవాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పరవాడలో మంగళవారం నిర్వహించిన వారపు సంత నాగులచవితి కారణంగా వెలవెలబోయింది. వినియోగదారులు రాకపోవడంతో ఎప్పుడూ కిటకిటలాడే దుకాణాలన్నీ బోసిపోయాయి. లావాదేవీలు సాగకపోవడంతో వ్యాపారాలు డీలా పడ్డారు. నాగులచవితి కారణంగా పరిసర గ్రామాల నుంచి వారపుసంతకు వచ్చే వారంతా ఇళ్లకే పరిమితం కావడంతో సంతపై ప్రభావం కనిపించింది.

ఆయుష్ వైద్యంపై అవగాహన అవసరం


ఆయుష్ వైద్యంపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

సబ్బవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ వైద్యం పట్ల ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి చక్రవర్తి సూచించారు. ఆయుష్ వైద్యంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆశ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ, సాధారణ వ్యాధులు, మధుమేహం నియంత్రణకు ఆయుష్ వైద్యం ఎంతో మేలన్నారు. హోమియో వైద్యాధికారి కుసుమకుమారి మాట్లాడుతూ ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేనిది హోమియో వైద్యమన్నారు. హోమియో వైద్యం విశిష్టతను ప్రజల్లోకి తీసుకెల్లాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఆశ, విద్యాధరి, సీహెచ్‌వో, ఎంపీహెచ్‌వో, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులంతా ప్రయోజకులు కావాలి

▸▸ సింహాద్రి సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా


స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులతో సింహాద్రి సీజీఎం సంజయ్‌కుమార్

పరవాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులంతా కష్టపడి చదివి ప్రయోజకులుగా ఎదగాలని సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా సూచించారు. సింహాద్రి సామాజిక బాధ్యతలో భాగంగా పరవాడ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి, ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులందరికీ ఉత్కర్ష్ మెరిటోరియర్స్ స్కాలర్‌షిప్‌లను మంగళవారం అందజేశారు. ఒక్కొక్కరికి రూ.3 వేలు చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం సీజీఎం మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం సింహాద్రి తమ వంతు సాయం చేస్తున్నదన్నారు. స్థానిక సమ్మద్ హాలులో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సింహాద్రి వివిధ విభాగాల జీఎంలు బీబీ పాత్ర, పద్మప్రియా, సీఎస్ఆర్ ఉద్యోగులు ప్రకాశరావు, ఎస్‌పీ సింగ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నూతన క్రీడా పాలసీ ప్రోత్సాహం హర్షణీయం

ఉమ్మడి విశాఖ విలువిద్య సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న సూర్యనారాయణరెడ్డి

పరవాడ, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్పోర్ట్స్ పాలసీ, స్పోర్ట్స్ ఫర్ ఆల్ పై సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఉమ్మడి విశాఖ జిల్లా విలువిద్య సంఘం అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ క్రీడా విధానం వల్ల విద్యా విధానంలో కూడా పెనుమార్పులు వచ్చే అవకాశం ఉందన్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఆర్చరీ, రైఫిల్ షూటింగ్ అకాడమీ నెలకొల్పడం జరిగిందని, దీని కారణంగానే అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు ప్రతిభ చూపుతున్నారని చెప్పారు. ఈ క్రీడా విధానం రూపకల్పనకు కృషి చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నర్సీపట్నంలో పోలీసు యాక్టు-30 అమలు: డీఎస్పీ మోహన్

నర్సీపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసు యాక్టు-30 అమలు చేస్తున్నామని డీఎస్పీ మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గుంపులు గుంపులుగా తిరగకూడదని, సమూహాలుగా ఉండకూడదని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అలాగే నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు.

శారదా ఘాట్ రెడీ

▸▸ పరిసరాల్లో చెత్తాచెదారం తొలగింపు ▸▸ బహు సుందరంగా భక్తులకు అందుబాటులోకి..


చెత్తాచెదారం తొలగింపు తరువాత అందంగా తయారైన శారదా ఘాట్


శారదా ఘాట్ వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం (ఫైల్ ఫొటో)

అనకాపల్లి టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శారదా నది ఘాట్ కార్తీక మాసానికి సిద్ధమైంది. కార్తీకమాసం ఆరంభంలోనే భక్తులకు అందంగా అందుబాటులోకి వచ్చింది. శారదాఘాట్‌ను ఈ నెల 2వ తేదీ వరకు చూస్తే లోపలకు అడుగు పెట్టేందుకు కూడా భక్తులు సాహసించే పరిస్థితి లేదు. ఘాట్‌కు ఆనుకుని చెత్తాచెదారంతో పాటు ఇతర వ్యర్థాలు గుట్టలుగా పడి ఉండడంతో నది లోపలకు వెళ్లేందుకు వీల్లేనంతలా తయారైంది. ఫలితంగా భక్తులు, స్వాములు, ప్రజలు స్నానాలు చేయడానికి లోపలకు వెళ్లేందుకు సాహసించలేకపోయేవారు.

ఇంత దుర్భరంగా ఉన్న ఘాట్‌ను పరిశుభ్రంగా చేసేందుకు ఈ నెల 3న గ్రీన్‌క్లబ్ స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చింది. మునిసిపల్, పంచాయతీ కార్మికులు కూడా మేము సైతమంటూ శ్రమదానం చేశారు. వీరందరినీ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అభినందించారు. సుమారు రెండు గంటల పాటు క్లబ్ ప్రతినిధులు, ఇతరులు పెద్ద ఎత్తున హాజరై శారదా ఘాట్‌కు ఆనుకుని పేరుకుపోయిన చెత్తా చెదారం, వ్యర్థాలను ఒక వాహనంలో దూర ప్రాంతాలకు తరలించారు. దీంతో ఒక్కసారిగా శారదా నది ఘాట్ పరిసరాల రూపురేఖలు మారాయి. ఇప్పుడు ఎంతో పరిశుభ్రంగా కనిపిస్తోంది.

కార్తీకమాసంలో చాలా మంది మహిళా భక్తులు పూజా సామగ్రితో సహా శారదానదికి వచ్చి పుణ్యస్నానాలను ఆచరిస్తారు. అనంతరం అక్కడే ఉన్న ఉమారామలింగేశ్వరస్వామికి పూజలు చేయడం ఆనవాయితీ. రెండో తేదీ నుంచే కార్తీకమాసం ప్రారంభమైనప్పటికీ, నది పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో స్నానానికి సాహసించలేదు. అలాగే అయ్యప్ప స్వాములు కూడా ఎక్కువ మంది నదిలో స్నానానికి వెళ్తుంటారు. వీరందరికీ ఇప్పుడు నది పరిశుభ్రంగా ఉండడంతో ఆనందంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా క్లబ్ ప్రతినిధులు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చారంటూ అభినందిస్తున్నారు.

వాడవాడలా నాగులచవితి వేడుకలు

అనకాపల్లి టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాగులచవితి వేడుకలను మంగళవారం వాడవాడలా నిర్వహించారు. తెల్లవారుజామున ఐదు గంటల నుంచే పిల్లాపాపలతో భక్తులకు పుట్టలకు చేరుకుని పాలు పోసి భక్తిభావాన్ని చాటుకున్నారు. అనకాపల్లి పట్టణ పరిధిలోని జాతీయ రహదారి, ఫూల్‌బాగ్ రోడ్డు, ఎన్టీఆర్ మార్కెట్‌యార్డు, రైల్వే ట్రాక్, శారదా బ్రిడ్జి తదితర ప్రాంతాల్లోని పుట్టల్లో ప్రజలు పాలు పోశారు. గవరపాలెంలోని దిబ్బవీధి నాగేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గవరపాలెం వాసులతో పాటు పట్టణ వాసులు కూడా ఆలయానికి వచ్చి పుట్టలో పాలు పోసి నాగేంద్రుని దర్శించుకున్నారు. అలాగే ఎన్టీఆర్ మార్కెట్ యార్డులోని నాగదుర్గమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పలు ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి ఆలయం వెనుక పుట్టల్లో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. నాగదుర్గమ్మ, గవరపాలెం నాగేంద్రుని ఆలయాలకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రత్నాకర్‌ను సత్కరించారు. డైట్ కళాశాలలోని పుట్ట వద్ద మాజీ మంత్రి దాడి వీరభద్రరావు కుటుంబ సభ్యులంతా పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పట్టణంలోని పలు రహదారులు చవితి వేడుకలు జరుపుకునే భక్తులతో సందడిగా మారాయి.



అనకాపల్లి మార్కెట్ యార్డులో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు... డైట్ కళాశాలలో పుట్ట వద్ద పూజ చేసిన మాజీ మంత్రి దాడి కుటుంబీకులు

అనకాపల్లి మండలంలో...

అనకాపల్లి రూరల్: మండలంలోని నాగులచవితి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. వేకువజాము నుంచి కుటుంబ సమేతంగా ఉపవాసాలతో సమీపంలోని పుట్టలకు వెళ్లి నాగేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తమ వెంట తీసుకువచ్చిన ప్రసాదాలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో గ్రామాల్లో పుట్టల వద్ద భక్తుల తాకిడితో కోలాహలంగా మారింది. పుట్ట మన్ను చెవికి దిద్దుకుంటే చెవి పోటు రాదన్న ప్రగాఢ నమ్మకంతో అత్యధిక భక్తులు పుట్టమన్నును చెవికి రాసుకున్నారు.

కొత్తూరు: అనకాపల్లి మండలంలోని రామాపురం, బి.ఆర్.టి.కాలనీ, సుందరయ్యపేట, అచ్చియ్యపేట, వెంకుపాలెం, సీతానగరం, తగరంపూడి, జగన్నాథపురం, మెట్టపాలెం, కూండ్రం, కుంచంగి తదితర గ్రామాల్లో నాగులచవితి వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా పంటపొలాల్లో పుట్టల వద్దకు వెళ్లి పాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. రైతులు, భక్తులు వారి వారి పొలాల వద్ద నాగేంద్రుడుకి ప్రత్యేక పూజలు చేశారు.


అనకాపల్లి మండలం గొలగాం పంచాయతీ శివారు కేటీఆర్.పాలెంలో పుట్ట వద్ద నాగేంద్రుని పూజలు చేస్తున్న భక్తులు


పరవాడ మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ రాముడుగారి ఊరి పొలాల్లో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కశింకోటలో...

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో నాగులచవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వెదురుపర్తి, బయ్యవరం, తేగాడ, కొత్తపల్లి, కొత్తపల్లిబుచ్చెయ్యపేట, జమాదులపాలెం, తాళ్లపాలెం, సోమవరం, నర్సింగబిల్లి, జి.భీమవరం, సుందరయ్యపేట, అడ్డాం, చెరకం, కన్నూరుపాలెం తదితర గ్రామాల్లో నాగులచవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కాగా ఏ.ఎస్.పేట గ్రామంలో వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, మలసాల కుమార్‌రాజా కుటుంబ సభ్యులతో కలిసి నాగేంద్రుని పుట్ట వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పుట్ట వద్ద నాగేంద్రునికి పాలు, గుడ్లు నైవేద్యంగా సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు.

పరవాడలో...

పరవాడ: నాగులచవితి పర్వదినాన్ని మంగళవారం మండల వ్యాప్తంగా భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పిల్లలు, పెద్దలు తారతమ్యం లేకుండా తండోపతండాలుగా పుట్టల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగేంద్రునికి ఇష్టమైన చిలిమిడి, తాటిగుజ్జు, పాలు, గుడ్లను నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కోలాహలం కనిపించింది. పుట్టల వద్ద భారీ ఎత్తున బాణసంచా కాల్చారు.

సబ్బవరంలో....

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నాగుల చవితి వేడుకలను ప్రజలు భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు. ఉదయం 6 గంటల నుంచి పుట్టల వద్దకు తరలివెళ్లి సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం పుట్టలో గుడ్లు, పాలు పోసి నాగేంద్రుడికి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని ప్రధానంగా లింగాలతిరుగుడు సోమలింగేశ్వరాలయం, దేవీపురంలోని రాజరాజేశ్వరీ సహస్రాక్షి అమ్మవారి ఆలయం, సబ్బవరం, మొగలిపురం, గుల్లేపల్లి, రావలమ్మపాలెం, అమృతపురం, గొటివాడ, అసకపల్లి తదితర గ్రామాల్లో ప్రధాన ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.


కశింకోట మండలం ఏఎస్.పేటలో నాగులచవితి వేడుకల్లో పాల్గొన్న వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్ తదితరులు

రాజ్యాంగ హక్కుల కోసం ఉద్యమిద్దాం..

▸▸ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు సూర్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

అనకాపల్లి టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతు, కార్మిక రాజ్యాంగ హక్కుల కోసం ఉద్యమిద్దామని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఎం.సూర్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో కిసాన్ సంయుక్త మోర్చ కన్వీనర్ కర్రి అప్పారావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబరు కోడ్‌లు రద్దు చేసి పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఏ రంగంలో పనిచేసే కార్మికునికైనా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. అసంఘటితరంగ కార్మికులు, ఆటో, హమాలీలు, ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సామాజిక భద్రత చట్టాలను అమలు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచి రోజు వేతనం రూ.600 చెల్లించాలన్నారు. అలాగే బడ్జెట్‌లో వీటికి కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం ఈ నెల 26వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త ఆందోళనలకు రైతు కార్మిక సంఘాలు పిలుపును విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల్లో పనిచేసే ఉద్యోగులకు బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ కన్వీనర్ వైఎన్ భద్రం, నాయకులు ఎం.అప్పలరాజు, కోరిబిల్లి శంకరరావు, గాడి బాలు, డి.వెంకన్న, జి.శ్రీరామ్ పాల్గొన్నారు.

సబ్బవరంలో ఈకేవైసీ కేంద్రం ఏర్పాటుచేయరూ..

సబ్బవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలులో భాగంగా దీపావళికి ప్రారంభించిన దీపం-2 పథకం విజయవంతంగా అమలు కావాలంటే మండల కేంద్రంలో ఈకేవైసీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని టీడీపీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేసుపూడి రమణ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సబ్బవరంలో ఇండియన్ గ్యాస్, భారత పెట్రోలియం గ్యాస్, హిందూస్థాన్ పెట్రోలియం గ్యాస్ వినియోగదారులు ఉన్నారన్నారు. వారికి పెందుర్తి, అగనంపూడి, గాజువాక ప్రాంతాల్లోని ఏజెన్సీల నుంచి గ్యాస్ సిలిండర్లు పంపిణీ జరుగుతున్నాయన్నారు. ఆయా ప్రాంతాల్లోనే కార్యాలయాల్లో సాంకేతిక పరమైన పనులన్నీ నిర్వహిస్తుండడంతో వినియోగదారులు అక్కడకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత గ్యాస్ పథకం కోసం ఈకేవైసీ నమోదు తప్పనిసరై కావడంతో వినియోగదారులు దూర ప్రాంతాలకు వెళ్లి గంటలు తరబడి క్యూలో నిల్చొని చేయించుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఈ విషయమై అధికారులు స్పందించి సబ్బవరంలో ఈకేవైసీ కేంద్రం ఏర్పాటు చేయాలని విన్నవించారు.

వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు

పరవాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు పరవాడ సీఐ జి.మల్లికార్జునరావు తెలిపారు. సీఐ అందించిన వివరాల ప్రకారం.. మండలంలోని వెన్నెలపాలెం గ్రామంలో ఈ నెల 14న మరిడిమాంబ పండగ జరపనున్నారు. ఈ విషయమై బుధవారం గ్రామంలో మీటింగ్ ఏర్పాటు చేసినట్టు మంగళవారం దండోరా వేశారు. తనకు తెలియకుండా దండోరా ఎందుకు వేయించారని సర్పంచ్ వెన్నెల అప్పారావును మరిడిమాంబ ఆలయ కమిటీ సభ్యుడు పైలా వెంకటరమణమూర్తి నిలదీశారు. చెప్పి దండోరా వేయించాల్సిన అవసరం లేదని సర్పంచ్‌తో అతని అనుచరులు వెన్నెల అయ్యబాబు, వెన్నెల సింహాద్రి అతనిపై దాడి చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

ట్రాఫిక్ సమస్యపై ఉమ్మడి కార్యాచరణ

వివిధ విభాగాల అధికారులతో జీవీఎంసీ కమిషనర్, సీపీ సమావేశం సమీక్ష

విశాఖపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్‌కు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించుటకు జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, నగర పోలీసు కమిషనర్ శంకబ్రత బాగ్చి పలు విభాగాల అధికారులతో జీవీఎంసీలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ నగరంలోని పలు ప్రాంతాలు, కూడళ్లలో కలుగుతున్న ట్రాఫిక్‌నకు సంబంధించి సీసీ కెమెరాలు, వీధిలైట్లు, ట్రాఫిక్ సిగ్నల్, జంక్షన్ లైట్లు, జాతీయ రహదారిపై లైట్లు, కాంతివంతం లేని లైట్లు, గుర్తించిన చీకటి ప్రదేశాలు, కొత్తగా ఎలక్ట్రికల్ పోల్స్ ఏర్పాటు రోడ్ల మరమ్మతులు తదితర సమస్యల పరిష్కారానికి జీవీఎంసీ సహకారం అవసరం అన్నారు. నగరంలో హత్యలు, దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి తాగే బృందాలు వంటి వాటిని నియంత్రణకు పటిష్ఠ చర్యలు అవసరమన్నారు. రోడ్డు ఆక్రమణలు ఎక్కువగా ఉండడం కూడా ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారుతోందన్నారు.

అనంతరం జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ స్పందిస్తూ నగరంలో 1.18 లక్షలకు పైగా వీధి దీపాలు వివిధ జంక్షన్లలో ఉన్నాయన్నారు. పని చేయని వాటిని మరమ్మతులు చేపడుతున్నామని, చీకటి ప్రాంతాలను గుర్తించి అక్కడ కొత్త లైట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాంతివంతమైన లైట్లను ఏర్పాటు చేయాలని ఇప్పటికే అధికారులకు , సంబంధిత ఏజెన్సీలకు ఆదేశించినట్టు చెప్పారు. అలాగే సీసీ కెమెరాలను, పెడస్ట్రియన్ క్రాసింగ్ సిగ్నల్స్‌లను పునరుద్ధరిస్తున్నామని, ప్రజా అవగాహన కోసం జీబ్రా లైన్స్‌ను, పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా రోడ్లు, ఫుట్‌పాత్ ఆక్రమణలకు సంబంధించి పోలీసు వారు సహకరించాలని, ఈ విషయమై పోలీసు, జీవీఎంసీ సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి పలు కూడళ్లలో ట్రాఫిక్ ఐలాండ్‌లను ఏర్పాటు పరిశీలనలో ఉందన్నారు. డిసెంబరు ఆఖరి నాటికి పలు సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ పి.శివప్రసాద్‌రాజు, పర్యవేక్షక ఇంజనీర్లు పీవీవీ సత్యనారాయణరాజు, సంపత్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీధర్, స్మార్ట్ సిటీ అధికారులు, కంట్రోల్ రూమ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హస్సేన్, ఈస్ట్-2 ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అమ్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'క్రీడా పాలసీకి ప్రోత్సాహం ఆనందకరం'

కొత్తూరు: నూతన క్రీడా పాలసీ విధానాన్ని ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయం ఆనందకరమని అనకాపల్లి బాడీ బిల్డర్స్ అండ్ ఫిట్నెస్ అసోసియేషన్ కార్యదర్శి శిలపరశెట్టి బాబీ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్, జాతీయ, ప్రపంచ, ఆసియా నుంచి ఒలింపిక్ స్థాయి వరకు పతకాలు సాధించిన క్రీడాకారులకు భారీగా నగదు ప్రోత్సాహకాలు పెంచడం అభినందించదగ్గ విషయమన్నారు. అంతేకాకుండా స్పోర్ట్స్ కోటాను రెండు నుంచి మూడు శాతానికి పెంచడం క్రీడాకారులకు శుభపరిణామమన్నారు. క్రీడల కోసం, క్రీడాకారుల భవిష్యత్తు కోసం ఆలోచించి ప్రోత్సహించే ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని కొనియాడారు. ఎంతో ప్రతిభ కనబరిచిన వారికి ఆర్థిక ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు అవకాశాలు లేక నిరుత్సాహంగా ఉన్న క్రీడాకారులకు ఈ నిర్ణయంతో నూతన ఉత్తేజం నెలకొందని ఆయన తెలిపారు. అమరావతిని స్పోర్ట్స్ సిటీగా, పలు జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, క్రీడా పాఠశాలలు ఏర్పాటుకు ఆదేశించడం క్రీడాభివృద్ధికి మరింత దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అనంత జలపాతాల హొయలు

(అనంతగిరి-ఆంధ్రజ్యోతి)

ఎత్తైన పచ్చని కొండలు, ఉరకలేస్తున్న పాల నురగలాంటి ధారలు, ఆహ్లాదకర వాతావరణం..పర్యాటకులను ఇట్టే కట్టి పడేస్తుంది. మన్యంలో ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో అనంతగిరి ఒకటి. అధిక సంఖ్యలో జలపాతాలు కలిగిన మండలం ఇదే. మండలంలోని కటికి, సరియా, తాటిగుడ, చిట్టంపాడు, పెదబయలు, గొల్లగెడ్డ జలపాతాలు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఆయా జలపాతాలను సందర్శించేందుకు దూర ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. ఆయా జలపాతాలకు ఎలా చేరుకోవాలంటే...


కటికి జలపాతానికి రెండు మార్గాలు


మండలంలో కటికి జలపాతం ఎత్తైనది. సుమారు 400 అడుగుల ఎత్తు నుంచి నీరు కిందకు ఉరకలేస్తుంది. పర్యాటకులు స్నానాలు చేసేందుకు అనుకూలంగా ఉంటుంది. ఇక్కడికి వెళ్లడానికి రెండు మార్గాలు ఉన్నాయి. మొదటి మార్గం బొర్రా వరకు రైలులో వచ్చి, స్టేషన్ వద్ద దిగి ముందుగా బొర్రాగుహలు తిలకించి, ఆ తరువాత గేటువలస మీదుగా కటికి జలపాతానికి సుమారు ఏడు కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. అయితే ద్విచక్ర వాహనాలకు మాత్రమే వెళ్లడానికి అనుమతి ఉంది. లేదా అక్కడ స్థానికంగా ప్రైవేటు జీపులు అందుబాటులో ఉంటాయి. వాటి ద్వారానే వెళ్లాలి. కటికి వెళ్లే మార్గంలో రైల్వే పట్టాల వరకు ప్రయాణించి, అక్కడ నుంచి కిలోమీటరున్నర నడిస్తే జలపాతం వద్దకు చేరుకోవచ్చు. ప్రస్తుతం రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అలాగే దీనికి రెండో మార్గం.. అరకు-విశాఖ ప్రధాన రహదారిలో సుంకరమెట్ట నుంచి సుమారు ఏడు కిలో మీటర్లు ప్రయాణిస్తే జలపాతం సమీపానికి వెళతాం. అక్కడ నుంచి అర కిలోమీటరు నడిస్తే జలపాతం వద్దకు చేరుకోవచ్చు. అయితే ప్రస్తుతం ఒక కిలోమీటరు మేర రోడ్డు పనులు జరుగుతున్నాయి.



మండలంలో అత్యధికం

- పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న కటికి, సరియా, తాటిగుడ జలపాతాలు
- సహజసిద్ధ ప్రకృతి అందాలకు నెలవు





సరియా జలపాతం



అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం శారదా నది వద్ద ఉన్న వంతెన పైనుంచి సుమారు కిలోమీటరు ప్రయాణించిన తరువాత ఎడమ వైపునకు వెళితే పెదగంగవరం మీదుగా వాలబు వరకు 8 కిలోమీటర్లు ప్రయాణించాలి. అక్కడ నుంచి మట్టి రోడ్డుపై సుమారు మూడు కిలోమీటర్లు ప్రయాణిస్తే సరియా జలపాతం గెడ్డ వద్దకు చేరుకుంటాం. అక్కడ నుంచి అటవీ ప్రాంతం మీదుగా అర కిలోమీటరు నడిస్తే జలపాతాల అందాలను దగ్గర నుంచి వీక్షించవచ్చు. అయితే ఈ జలపాతం ప్రమాదకరమనే చెప్పాలి. 2015లో బాహ్య ప్రపంచానికి ఈ జలపాతం పరిచయం కాగా, ఇప్పటివరకు 40 మందికి పైగా పర్యాటకులు మృత్యువాత పడ్డారు. కొంతమంది ప్రమాదవశాత్తూ జారిపడి, మరికొంత మది ఈతకు దిగి ప్రాణాలు కోల్పోయారు. పోలీస్‌శాఖ హెచ్చరికలు పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు జరగవు.

పెదబయలు జలపాతం


అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం శారదా నది వద్ద ఉన్న వంతెన పైనుంచి జీనబాడు మీదుగా పెదకోట, కుడియా జాలడ వరకు తారురోడ్డుపై సుమారు 35 కిలోమీటర్లు ప్రయాణించాలి. అక్కడ నుంచి వంత్రబు మీదుగా బొడ్డపుట్టు వరకు తారురోడ్డుపై 8 కిలోమీటర్లు ప్రయాణించిన తరువాత పెదబయలు చేరుకుంటాం. సుమారు ఒక కిలోమీటరు మేర కాలినడకన జలపాతం వద్దకు చేరుకోవచ్చు. దీనికి మరో మార్గం ఉంది. హుకుంపేట మండలం పాటిగరువు నుంచి వేలమామిడి మీదుగా బొడ్డపుట్టు వరకు 30 కిలోమీటర్లు ప్రయాణిస్తే జలపాతానికి చేరుకోవచ్చు.

తాటిగుడ జలపాతం

అనంతగిరి మండల కేంద్రానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో తాటిగుడ జలపాతం ఉంది. అరకు-విశాఖ ప్రధాన రహదారి సంతబయలు నుంచి రెండు కిలోమీటర్లు ప్రయాణిస్తే జలపాతానికి చేరుకోవచ్చు. రెండు స్టెప్‌ల పైనుంచి జలపాతం పచ్చని పంట పొలాలను ఆనుకుని ప్రవహిస్తున్నది. ఆటోలు, కార్లు, జీపులు, ద్విచక్ర వాహనాలు వెళతాయి. బస్సులు వెళ్లేందుకు వీలులేదు.

చిట్టంపాడు జలపాతం

ములియగుడ జంక్షన్ నుంచి రాయవలస వరకు కిలోమీటరున్నర తారురోడ్డుపై ప్రయాణించి, అక్కడ నుంచి మట్టి రోడ్డుపై చిట్టంపాడు వరకు ఒక కిలోమీటరు ప్రయాణిస్తే జలపాతానికి చేరుకోవచ్చు. టోకూరు పంచాయతీ ఆధ్వర్యంలో జలపాతాన్ని అభివృద్ధి చేస్తున్నారు. సుమారు రెండు అడుగుల ఎత్తునుంచి రెండు కొండలను ఆనుకుని జలపాతం మూడు స్టెప్‌లుగా ప్రవహిస్తుంది.



గొల్లగెడ్డ జలపాతం

అరకు-విశాఖ ప్రధాన రహదారిని ఆనుకుని డముకు గ్రామం నుంచి ఎడమ వైపు సుమారు 17 కిలో మీటర్లు వాలసీ-నిమ్మలపాడు రోడ్డులో ప్రయాణించిన తరువాత మద్దిగరువు గ్రామం వస్తుంది. అక్కడ నుంచి పంట పొలాలను ఆనుకుని కాలినడకన అర కిలోమీటరు వెళితే గొల్లగెడ్డ జలపాతానికి చేరుకోవచ్చు. అయితే పెద్దగా బాహ్య ప్రపంచానికి ఈ జలపాతం గురించి తెలియకపోవడంతో పర్యాటకులు వచ్చే పరిస్థితి లేదు. స్థానికులు ఎక్కువగా సందర్శిస్తుంటారు.

మల్లవరంలో వింత ఆచారం

- నాగుల చవితినాడు వరి దుబ్బుకు పూజలు
- పప్పుదినుసులు, తృణధాన్యాల మొలకలతో ఊరేగింపు

అచ్యుతాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితినాడు అన్నిచోట్లా పుట్టల్లో పాలుపోసి నాగేంద్రుడికి పూజలు చేస్తుంటారు. కానీ మండలంలోని మల్లవరంలో మాత్రం వరి దుబ్బుకి పూజలు చేస్తారు. దీపావళి నుంచే వీరికి నాగుల చవితి ప్రారంభం అవుతుంది. దీపావళినాడు మహిళలంతా ఉపవాసం ఉండి బొబ్బర్లు, పెసలు, చోళ్లు, మినుములు, తదితర పప్పుదినులు, తృణధాన్యాలను మట్టి మూకుళ్లలో పోసి మట్టి, నీరు పోస్తారు. మహిళలంతా ఒంటి పూట భోజనం చేస్తారు. రోజూ రాత్రిపూట గౌరీ దేవిని స్తుతిస్తూ పాటలతో భజనలు చేస్తారు. నానబెట్టిన పప్పుదినుసులు, తృణధాన్యాలు మొలకలు వచ్చి ఐదో రోజుకు ఏపుగా, వత్తుగా పెరుగుతాయి. వీటిని జాజవలు అని పిలుస్తారు. నాగులచవితి నాడు అందరూ కలిసి మొలకలను శిరస్సుపై పెట్టుకుని బాజా భజంత్రీలతో ఊరేగింపుగా గ్రామానికి సమీపంలో వున్న గొరికివాని గెడ్డ వద్దకు వెళతారు. అక్కడ వరి దుబ్బుకి పూజలు నిర్వహిస్తారు. అనంతరం జాజవలను గెడ్డలో కలుపుతారు. ఈ సంవత్సరం కూడా జాజవల పండగను ఘనంగా నిర్వహించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

మల్లోడిగెడ్డ వాగు కాలుష్యంపై 'విజిలెన్స్'

- పరవాడ, తానాం సర్పంచుల నుంచి వివరాలు సేకరించిన సీఐ రవిప్రసాద్
- నీటి నమూనాలను సేకరించిన పీసీబీ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పరవాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పరవాడ నుంచి భరణికం వెళ్లే దారిలో ఫార్మా వ్యర్థాలతో నిండిపోయిన మల్లోడిగెడ్డ వాగుపై 'ఇది జలం కాదు... గరళం' అన్న శీర్షికతో మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై విజిలెన్స్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. విజిలెన్స్ సీఐ రవి ప్రసాద్ మంగళవారం సిబ్బందితో వెళ్లి పరవాడ, తానాం సర్పంచులను కలిసి వివరాలు సేకరించారు.

ఫార్మా వ్యర్థా లను చెరువులు, గెడ్డల్లో కలపడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి సర్పంచులు వివరించారు. ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని, చర్మ, గుండె, కిడ్నీ సంబంధ వ్యాధులబారిన పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేకపోయిందని వాపోయారు.



నీటి నమూనాలను సేకరించిన పీసీబీ అధికారులు

నీటి నమూనాలు సేకరించిన పీసీబీ అధికారులు

మల్లోడి గెడ్డవాగును మంగళవారం కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఈఈ పీవీ ముకుందరావు, సిబ్బందితో కలిసి సందర్శించారు. నీటి నమూనాలను సేకరించారు. వీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు తరలించారు. రెండు రోజుల్లోగా నివేదికను వెల్లడిస్తామని ఆయన తెలిపారు. ఫార్మా వ్యర్థ జలాలు పెద్ద మొత్తంలో నీటిలో కలిసినట్టు నివేదిక వస్తే.. గతంలో మాదిరిగా మోటార్లతో గెడ్డ వాగులో నీటిని ట్యాంకర్లలోకి తోడి, ఫార్మా సిటీలోని రాంకీ టీఈపీటీకు తరలిస్తామన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు 7,777 దరఖాస్తులు

... 3వ పేజీ తరువాయి

మాత్రమే ఓటు నమోదుకు (ఇప్పటివరకూ అప్‌లోడ్ చేసినవి) ముందుకొచ్చారు. ఓటర్ల నమోదుకు బుధవారంతో గడువు ముగియనున్నది. గడువులోగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన తరువాత ఓటర్ల జాబితా రూపొందించి ఈనెల 23వ తేదీన ముసాయిదా విడుదల చేస్తారు. ముసాయితా జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. అదే సమయంలో కొత్తగా ఓటరుగా నమోదుకు అవకాశం ఉందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, విశాఖ డీఆర్వో బీహెచ్ భవానీశంకర్ పేర్కొన్నారు.

2019లో 19,593 మంది ఓటర్లు

2019లో జరిగిన ఎన్నికల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు టీచర్లు కలిపి 19,593 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019లో ఉమ్మడి విశాఖ జిల్లాలో 9,694 మంది ఓటర్లు ఉన్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు సంబంధించి 10,899 మంది ఓటర్లు ఉన్నారు.

ప్రైవేటు టీచర్ల దరఖాస్తుల్లో ఇబ్బందులు

గుర్తింపుపొందిన ప్రైవేటు పాఠశాలల్లో కనీసం మూడేళ్ల అనుభవం ఉంటేనే ఓటరుగా నమోదుకు అవకాశం ఉంది. అయితే టీచర్లు దరఖాస్తు చేసే సమయంలో ప్రైవేటు యాజమాన్యాలు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కావడం లేదు. దీనికి సంబంధించి ఇబ్బందులు తొలగించాలని టీచర్లు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చినా.. మారని పథకం పేరు

- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పేరుతో డౌన్‌లోడ్ అవుతున్న ఆయుష్మాన్ భారత్ కార్డులు



వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పేరుతో జారీ అయిన పీఎంజేఏవై కార్డు

రేలుగుంట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వృద్ధుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం కింద జారీ చేసే హెల్త్ కార్డులు 'వైఎస్సార్ ఆరోగ్యశ్రీ' పేరుతో డౌన్‌లోడ్ అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఇచ్చి ఐదు నెలలు అవుతున్నా ఇప్పటికీ కొన్ని పథకాల పేర్లు మారడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆరోగ్యశ్రీ పథకానికి ఎన్టీఆర్ పేరును మార్చినా ఇప్పటికీ పాత పేరుతోనే కార్డులు వస్తున్నాయి. ఈ కార్డులు ఆస్పత్రుల్లో చెల్లుబాటు అవుతాయో, లేదోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఆన్‌లైన్‌లో మార్పులు చేసి నూతన కార్డులు జారీ చేయాలని కోరుతున్నారు.



దివంగత మాజీ రాష్ట్రపతి శంకర్ దయాల్‌శర్మతో రెడ్డి సత్యనారాయణ (ఫైల్)

రెడ్డి మాస్టారు ఇకలేరు

... 3వ పేజీ తరువాయి

చేశాయి. రాజకీయంగా టీడీపీని విభేదించే ఇతర పార్టీల నాయకులు కూడా ఆయనను ఎంతో గౌరవిస్తారు. అందుకే రెడ్డి సత్యనారాయణను 'అజాత శత్రువు'గా అభివర్ణిస్తుంటారు. ఆయనకు క్రీడలంటే మక్కువే. తరచూ షటిల్ బ్యాడ్మింటన్ ఆడేవారు. ఆయన వందేళ్లపాటు జీవించడానికి క్రమశిక్షణతో కూడిన జీవన విధానం, ఆహారపు అలవాట్లే కారణమని కుటుంబ సభ్యులు, స్నేహితులు అంటుంటారు.

నేడు పెదగోగాడలో అంత్యక్రియలు

మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ అంత్యక్రియలు బుధవారం పెదగోగాడలో నిర్వహించడానికి కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేతోపాటు మాజీ మంత్రి కావడంతో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తారు. రెడ్డి సత్యనారాయణ మృతి పట్ల ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజా సంఘాల నేతలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.



హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయతో రెడ్డి సత్యనారాయణ (ఫైల్)

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

- అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ
- అండర్-17 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో విజేతలుగా విశాఖ బాలురు, బాలికల జట్లు
- జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్లు ఎంపిక

తుమ్మపాల (అనకాపల్లి జిల్లా), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు వుంటుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. తుమ్మపాలలో మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ, క్రీడా రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. జాతీయస్థాయి క్రీడా పోటీల నిర్వహణకు అనకాపల్లిలో స్టేడియం నిర్మించే అంశాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానన్నారు. కాగా అండర్-17 విభాగంలో జరిగిన ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాల నుంచి బాలురు, బాలికల జట్లు పాల్గొన్నాయి. బాలురు, బాలికల విభాగాల్లో ఉమ్మడి విశాఖ జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. బాలుర విభాగంలో ద్వితీయ బహుమతిని ప్రకాశం జిల్లా, తృతీయ బహుమతిని కృష్ణా జిల్లా, బాలికల విభాగంలో ద్వితీయ బహుమతిని నెల్లూరు, తృతీయ బహుమతిని తూర్పుగోదావరి జిల్లా జట్లు పొందాయి.



ఖోఖో బాలుర విజేత జట్టు(విశాఖ)కు ట్రోఫీ అందజేస్తున్న అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

జాతీయ పోటీలకు రాష్ట్ర జట్టు ఎంపిక

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో డిసెంబరు ఐదు నుంచి తొమ్మిదో తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనే రాష్ట్రస్థాయి అండర్-17 బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశారు. బాలుర జట్టులో జి.అజయ్ (విశాఖపట్నం), బి.సాయి (విశాఖపట్నం), సీహెచ్ ప్రసాద్ (విశాఖపట్నం), డి.వినయ్ (ప్రకాశం), పి.నరేశ్ (ప్రకాశం), డి.రాకేశ్ (కృష్ణా), ఎం.శివ (విజయనగరం), బి.తిరుమల (శ్రీకాకుళం), ఈ.శశాంత్ గౌడ్ (అనంతపురం), ఎస్.నవీన్ (నెల్లూరు), జె.యాలప్ప (కర్నూలు), బి.ఎవన్ (చిత్తూరు) వున్నారు. బాలికల జట్టులో కె.లాస్య (విశాఖపట్నం), పి.జ్యోత్స్న (విశాఖపట్నం), జె.గీత (విశాఖపట్నం), డి.నందిని (తూర్పుగోదావరి), సీహెచ్.లావణ్య (విజయగనరం), బి.భార్గవి (నెల్లూరు), డి.రంగ మహాలక్ష్మి(గుంటూరు), కాకి దివ్య (పశ్చిమగోదావరి), కె.పవిత్ర (నెల్లూరు), ఎస్‌పి హస్మిత (చిత్తూరు), జి.దేవి (కడప), జి.భవాని (శ్రీకాకుళం) వున్నారు.



ఖోఖో బాలికల విజేత జట్టు(విశాఖ)కు ట్రోఫీ అందజేస్తున్న కొణతాల